



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 1 సంచిక : 87 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : శ్రీకాకుళం శుక్రవారం 10 ఏప్రిల్ 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 87 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : SRIKAKULAM FRI 10 APRIL 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, Chittor, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur


# భూ రికార్డులు ఇక తారుమారు చేయలేరు

## కరెన్సీకి వాడే టెక్నాలజీ వాడుతున్నాం: సీఎం చంద్రబాబు

- సూరేపల్లిలో 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు
- 2027 మార్చి నాటికి 1.12 కోట్ల కొత్త పాస్‌పుస్తకాల పంపిణీ లక్ష్యం
- భూ రికార్డుల భద్రతకు బ్లాక్‌చైన్ టెక్నాలజీ, రికార్డ్ లాకింగ్ సిస్టమ్
- 22ఏ నిషేధిత జాబితా నుంచి 1.37 లక్షల ఎకరాల ఇనామ్ భూములకు విముక్తి
- ఆటో మ్యుటేషన్ తర్వాత పాస్‌బుక్‌ను నేరుగా లబ్ధిదారుని ఇంటికే పంపాలని ఆదేశం



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత ముగింపు పలికే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని, 2027 మార్చి నాటికి రాష్ట్రవ్యాప్తంగా 1.12 కోట్ల పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేయడమే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. బాపట్ల జిల్లా వేమూరు నియోజకవ ర్గంలోని సూరేపల్లిలో గురువారం జరిగిన 'మీ భూమి–మీ హక్కు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు కొత్త పాస్‌పుస్తకాలను అందజేసి, వారి సమక్షంలోనే భూ వివరాలను అధికారులతో చదివి వినిపించారు. అవినీతికి ఆస్కారం లేకుండా, ఆటో మ్యుటేషన్ తర్వాత పాస్‌బుక్‌ను నేరుగా యజమాని ఇంటికే పంపాలని అధికారులను ఆదేశించారు.

**భూ రికార్డులకు పటిష్ఠ భద్రత**

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. భూమి కేవలం ఆస్తి మాత్రమే కాదని, అది ప్రజల భద్రత, జీవనాధారమని అన్నారు. భూ వివాదాలను శాశ్వతంగా పరిష్కరించేందుకు 'రీ సర్వే 2.0' చేపట్టామని, 2027 మార్చి నాటికి రాష్ట్రంలోని 16,816 గ్రామాల్లో ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. కొత్త పాస్‌పుస్తకాలకు కరెన్సీకి వాడే టెక్నాలజీనే వినియోగిస్తున్నామని, దీనివల్ల భవిష్యత్తులో ఎవరూ రికార్డులను తారుమారు చేయలేరని భరోసా ఇచ్చారు. "రికార్డులు ట్యాంపరింగ్ కాకుండా బ్లాక్‌చైన్ టెక్నాలజీ, క్యూఆర్ కోడ్ విధానం తీసుకొచ్చాం. భూ యజమానులు తమ ఆధార్, ఈ–కేవైసీ ద్వారా భూ రికార్డులను లాక్ చేసుకునేందుకు 'రికార్డుల లాకర్ సిస్టమ్'ను అందుబాటులోకి తెచ్చాం. ఇది ప్రజల ఆస్తులకు రక్షణ కవచంగా ఉంటుంది. ప్రజల భూములకు రక్షణ కల్పించాలనే ఉద్దేశంతోనే వివాదాస్పద ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌ను రద్దు చేశాం" అని ముఖ్యమంత్రి వివరించారు.

**22ఏ జాబితా ప్రక్షాళన, కీలక నిర్ణయాలు**

భూ యజమానులకు మేలు చేసే పలు కీలక నిర్ణయాలను సీఎం ప్రకటించారు. 1.37 లక్షల ఎకరాల విలేజ్ సర్వీస్ ఇనాం భూములను 22ఏ నిషేధిత జాబితా

మిగతా 2లో



పవన్ ఖేరా అరెస్ట్‌పై ఉత్కంఠ...

## తీర్పు రిజర్వ్ చేసిన తెలంగాణ హైకోర్టు

- అసోం సీఎం భార్యపై ఆరోపణల కేసులో పవన్ ఖేరాకు అరెస్ట్ ముప్పు
- అరెస్ట్ నుంచి తాత్కాలిక రక్షణ కోరుతూ తెలంగాణ హైకోర్టులో పిటిషన్
- ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, తీర్పు రిజర్వ్
- నేడు వెలువడనున్న తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ
- ఇది రాజకీయ కక్ష సాధింపేనని ఖేరా తరఫు న్యాయవాది వాదన

మిగతా 2లో



## చంద్రబాబు విజన్, లోకేశ్ కృషి ఫలితం

'సిటీ ఆఫ్ డెస్టినీ' నుంచి గ్లోబల్ ఏఐ సిటీగా విశాఖ

- విశాఖలో గూగుల్ భారీ డేటా సెంటర్ ఏర్పాటు
- రూ.1.35 లక్షల కోట్లతో రానున్న మెగా ప్రాజెక్టు
- ఈ నెల 28న శంకుస్థాపన చేయనున్న సీఎం చంద్రబాబు
- గ్లోబల్ ఏఐ సిటీగా మారనున్న విశాఖపట్నం
- చంద్రబాబు విజన్, లోకేశ్ కృషితోనే ఇది సాధ్యమైందన్న పల్లా

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి ప్రస్థానంలో మరో చారిత్రాత్మక అధ్యాయం మొదలుకాబోతోంది. ప్రపంచ టెక్ దిగ్గజం గూగుల్, విశాఖపట్నంలో భారీ డేటా సెంటర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) హబ్ ఏర్పాటుకు సిద్ధమైంది. సుమారు 15 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.1.35 లక్షల కోట్లు) పెట్టుబడితో రానున్న ఈ మెగా ప్రాజెక్టుకు ఈ నెల 28న ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేయనున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ ప్రాజెక్టుతో ఇప్పటివరకు 'సిటీ ఆఫ్ డెస్టినీ'గా ఉన్న విశాఖ, ఇకపై 'గ్లోబల్ ఏఐ సిటీ'గా ప్రపంచ పటంలో నిలవనుందని

మిగతా 2లో



సెల్ఫీ మోజులో విషాదం...

## జలపాతంలో పడి ముగ్గురు విద్యార్థినుల మృతి

- అల్లూరి జిల్లా అనంతగిరిలో విషాద ఘటన
- సెల్ఫీ తీసుకుంటూ జలపాతంలో పడి ముగ్గురు బాలికల మృతి
- మరో విద్యార్థిని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం
- మృతులు హుకుంపేట మండలానికి చెందిన ఇంటర్ విద్యార్థినులు
- ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

పెన్ పవర్ డెస్క్:అల్లూరి సీతారామరాజు జిల్లాలో విషాద ఘటన చోటుచేసు కుం ది. సెల్ఫీ తీసుకునే ప్రయత్నంలో అదుపుతప్పి జలపాతంలో పడి ముగ్గురు విద్యార్థినులు ప్రాణాలు

మిగతా 2లో

కేరళ, అసోం, పుదుచ్చేరిలో ముగిసిన పోలింగ్...

## ఫలితాలపై సర్వత్రా ఆసక్తి

- ప్రశాంతంగా ముగిసిన కేరళ, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్
- పుదుచ్చేరిలో రికార్డు స్థాయిలో నమోదైన ఓటింగ్ శాతం
- కేరళలో గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్న మూడు ప్రధాన కూటములు
- వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ భారీగా పోలింగ్
- మే 4న ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం చేసిన ఎన్నికల సంఘం



మిగతా 2లో

చేయాల్సింది పాదయాత్ర కాదు...

## ఆత్మవిమర్శన యాత్ర: జగన్ పై షర్మిల ఫైర్

- వైఎస్సార్ పాదయాత్రకు నేటితో 23 ఏళ్లు
- జగన్‌పై షర్మిల తీవ్ర విమర్శలు
- బీజేపీ కేసులకు భయపడి వైఎస్సార్ లౌకికవాదానికి జగన్ తూట్లు పొడిచారని ఆరోపణ
- దళితులు, మైనారిటీలపై దాడులు జరుగుతున్నా జగన్ మౌనంగా ఉన్నారని ఫైర్
- పాదయాత్ర కాదు, ముందు ఆత్మవిమర్శ యాత్ర చేయాలని జగన్‌కు హితవు



మిగతా 2లో



లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు...

## హెజ్బొల్లా చీఫ్ మేనల్లుడి హతం

- హెజ్బొల్లా నేత నయీమ్ ఖాసిం కార్యదర్శి అలీ యూసఫ్ హర్షీ హతం
- బీరుట్‌లో దాడి చేసి హతమార్చిన ఇజ్రాయెల్ సైన్యం
- అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందం మరుసటి రోజే ఈ ఘటన
- లెబనాన్‌లో 100కు పైగా హెజ్బొల్లా స్థావరాలపై దాడులు

మిగతా 2లో

## శత్రువులు మాపై విజయం సాధించలేరు

ఇరాన్ అణు ఇంధన సంస్థ అధిపతి

- కాల్పుల విరమణ ప్రతిపాదనలో యురేనియం శుద్ధి అంశాన్ని వ్యతిరేకిస్తోన్న అమెరికా
- అణు ఇంధనాన్ని పరిరక్షించుకోవడం తమ హక్కు అన్న మొహమ్మద్ ఎస్లామీ
- ఇరాన్ హక్కుల పరిరక్షణ అత్యవసరమని వ్యాఖ్య

మిగతా 2లో





## మావిగన్ కామెడీ అయిపోయింది...

- గత ప్రభుత్వం మాటలకే ప్రాధాన్యత ఇచ్చిందన్న అనిత
- నాయకులు కోర్టుల నుంచి చివాట్లు తిన్నారని ఎద్దేవా
- కూటమి ప్రభుత్వం విజ్ఞతతో నిర్ణయాలు తీసుకుంటోందని వ్యాఖ్య

మిగతా 2లో

## జీవన్ రెడ్డి ఇంటి వద్ద తోపులాట..

జర్నలిస్టులకు గాయాలు



- జగిత్యాలలోని జీవన్ రెడ్డి ఇంటికి వెళ్లిన కేటీఆర్, గంగుల, కొప్పుల
- భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ కార్యకర్తలు
- అదుపుతప్పి జర్నలిస్టులపై పడిపోయిన వైనం
- ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన ఖరీదైన మెరాలు ధ్వంసం
- కార్యక్రమాన్ని బాయ్ కాట్ చేసిన మీడియా ప్రతినిధులు

మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# భారత్‌లో హోమియోపతి వైద్యానికి ఆదరణ

ప్రజారోగ్య పరిరక్షణలో హోమియోపతి వైద్య విధానాలను వ్యాప్తి చేయడానికి, హోమియో వైద్య అభివృద్ధికి, సవాళ్లను అధిగమించడానికి, సాధారణం ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతి ఏట 10 ఏప్రిల్‌న "ప్రపంచ హోమియోపతి దినోత్సవం" నిర్వహించకపోవడం ఆనవాయితీగా మారింది. హోమియో వైద్య వ్యవస్థాపకుడు, పితామహుడు అయిన డా క్రిస్టియన్ శామ్యూల్ హానిమాన్ జన్మదినం 10 ఏప్రిల్ 1755 సందర్భంగా ప్రపంచ హోమియోపతి దినోత్సవం నిర్వహించడం కొనసాగుతున్నది. ప్రకృతి ప్రసాదించే మొక్కలు, ఖనిజాలు, జంతువుల నుంచి సేకరించిన ఔషధాలతో వ్యాధులకు హోమియో చికిత్సలు చేస్తారు. హోమియోపతి వైద్య విధానానికి ప్రధాన సూత్రంగా "లైక్ లౌస్ లైక్" అనే భావాన్ని తీసుకుంటారు. హోమియోపతి అనగా హోమియో (ఒకే రకమైన), పతోస్ (వ్యాధి) అనే గ్రీక్ భాష అర్థాలు ఉన్నాయి. హోమియోపతి వైద్య విధానం భారతంలో 1973లో ప్రభుత్వ గుర్తింపుతో బహుళ ప్రచారం పొందడం, 2014 తర్వాత అల్లోపతి వైద్యంతో పాటు "ఆయుష్ (ఆయుర్వేద, యోగా, యునానీ, సిద్ధ యోగా, నాచురోపతి, హోమియోపతి)" అంత్రికదత్వ శాఖను ప్రారంభించి హోమియో వైద్య విధానానికి పట్టం కట్టడం జరిగింది. శరీర వ్యాధినిరోధక శక్తిని పెంపొందిస్తూ వ్యాధి మూలాలను కనుగొని ఔషధ చికిత్సను చేయడం, ఎలాంటి ఔషధ దుష్ప్రభావాలు లేకుండా ఉండడం హోమియో ప్రత్యేకతగా తీసుకోవాలి. మన దేశంలో అనేక అనేక హోమియో వైద్య కళాశాలలు, హోమియో ఆసుపత్రులు ప్రారంభించడం జరుగుతున్నది. హోమియోపతి వైద్యం ద్వారా చర్మ, జీర్ణకోశ, ఎలర్జీ, మైగ్రెయిన్, మానసిక ఒత్తిడి, కీళ్ల నొప్పులు, నీరసం, రుతుస్రావం ముందు అనారోగ్యం, దీర్ఘకాలిక అలసట, అస్తమా, వినికిడి రోగాలు, బిపీ, జలుబు లాంటి వ్యాధులకు సమర్ధవంతంగా చికిత్సలు చేస్తారు. దేశవ్యాప్తంగా 100 మిలియన్ల ప్రజలు హోమియో చికిత్సలు పొందుతుండగా, 2 లక్షల హోమియో డాక్టర్లు సేవలు అందిస్తూ, ప్రతి ఏట 12,000 మంది వైద్యులు హోమియో రంగంలోకి అడుగిడుతున్నారు. ప్రపంచ హోమియో దినం రోజుల హోమియో వైద్య శిబిరాలు, సెమినార్లు, సింపోజియాలు, కార్యశాలలు, హోమియో వైద్యులను సన్మానంచడం లాంటి కార్యక్రమాలు చేయడం జరుగుతుంది. ప్రపంచ హోమియోపతి దినోత్సవం-2026 ఇతివృత్తంగా "హోమియోపతితో సామరస్యం - హద్దులు దాటి వైద్యం చేయడం" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. సహజమైన, సరళమైన, సురక్షితమైన, ప్రభావితమైన హోమియోపతితో ఎలాంటి దుష్ప్రభావాలు లేకుండా రోగం మూలలను కనుగొని స్వస్థత చేకూర్చుతున్న ప్రపంచ హోమియోపతి వైద్యులకు, హోమియో వైద్యం పొందుతున్న రోగులకు ప్రపంచ హోమియోపతి దినం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేద్దాం.

## జీవన్ రెడ్డి ఇంటి వద్ద తోపులాట.. జర్నలిస్టులకు గాయాలు

జగిత్యాలలో రాజకీయ పరిణామాలు ఒక్కసారిగా ఉద్రిక్తతకు దారితీశాయి. మాజీ మంత్రి జీవన్ రెడ్డి నివాసం వద్ద జరిగిన తోపులాటలో మీడియా ప్రతినిధులు గాయపడటం, వారి పరికరాలు ధ్వంసం కావడం తీవ్ర కలకలం రేపింది.

వివరాల్లోకి వెళితే... కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్ తదితరులతో కలిసి జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా భారీ సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలు ఒక్కసారిగా లోపలికి దూసుకురావడంతో అక్కడ తీవ్ర తోపులాట చోటుచేసుకుంది. అదుపుతప్పిన కార్యకర్తలు అక్కడ విధుల్లో ఉన్న మీడియా ప్రతినిధులపై పడిపోవడంతో పలువురు జర్నలిస్టులకు గాయాలయ్యాయి. తోపులాటలో ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన ఖరీదైన వీడియో కెమెరాలు కిందపడి ధ్వంసమయ్యాయి. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన మీడియా ప్రతినిధులు, ఆ కార్యక్రమాన్ని బాయ్ కాట్ చేసి నిరసన తెలిపారు.

## మావిగన్ కామెడీ అయిపోయింది...

ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత వైసీపీపై మరోసారి విమర్శనాస్త్రాలు సంధించారు. ఏలూరులో నూతనంగా నిర్మించిన మహిళా పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు.

జగన్ ప్రతిపాదించిన 'మావిగన్' అంశంపై అనిత వ్యంగ్యంగా స్పందించారు. "మావిగన్ పేరు పెద్ద కామెడీ అయిపోయింది. ఆ పేరు ఎత్తితేనే ప్రజలు నవ్వుకుంటున్నారు" అని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం అభివృద్ధి కంటే మాటలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చిందని, కనీసం ఒక ఫైర్ ఇంజిన్ కూడా కొనుగోలు చేయలేనంతగా ప్రజా భద్రతను నిర్లక్ష్యం చేశారని ఆమె ఆరోపించారు.

గతంలో అవగాహన లేని నాయకులు ఇష్టానుసారం వ్యవహరించి కోర్టుల నుంచి చివాట్లు తిన్నారని, కానీ కూటమి ప్రభుత్వం మోదీ, చంద్రబాబు, పవన్ మార్గదర్శకత్వంలో విజ్ఞతతో నిర్ణయాలు తీసుకుంటోందని చెప్పారు. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థను అత్యాధునికీకరించి, మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. తప్పు చేసిన వారు ఎవరైనా చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగానే కొత్త మహిళా పోలీస్ స్టేషన్లను అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు. ఏలూరులో ఈ కొత్త పోలీస్ స్టేషన్ ప్రారంభించడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు.

# భూ రికార్డులు ఇక తారుమారు చేయలేరు

- మొదటి పేజి తరువాయి

నుంచి తొలగిస్తున్నట్లు వెల్లడించారు. 2016కు ముందు ప్రభుత్వ హౌసింగ్ స్కీమ్‌లో పట్టా పొందిన సుమారు 75 లక్షల పేద కుటుంబాలకు రిజిస్ట్రేషన్ సౌలభ్యం కల్పిస్తున్నామని, దీనివల్ల వారు తమ ఆస్తులను అమ్ముకునేందుకు, గిఫ్ట్‌గా ఇచ్చేందుకు వీలవుతుందని తెలిపారు. గత ప్రభుత్వం 14 లక్షల ఎకరాల పట్టా భూములను అక్రమంగా 22ఏలో చేర్చిందని, ఆ జాబితాను పూర్తిగా సంస్కరిస్తున్నామని అన్నారు. సమస్యల సత్వర పరిష్కారానికి 22ఏపై కలెక్టర్ అధికారాలను జేసీ, ఆర్డీవోలకు బదలాయిస్తున్నట్లు ప్రకటించారు. వెబ్‌ల్యాండ్ తప్పులను సుమోటోగా సరిదిద్దే అధికారాన్ని ఆర్డీవోలు, తహసీల్దార్లకు ఇస్తామని చెప్పారు.

**ఆటో-మ్యూటేషన్‌తో ఇంటికే పాస్‌బుక్**

ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా సంస్కరణలు తెస్తున్నామని సీఎం తెలిపారు. "జూన్ 2024 నుంచి ఇప్పటివరకు 9 లక్షల భూ లావాదేవీలకు ఆటో-మ్యూటేషన్ పూర్తి చేశాం. అమ్మకాలు, బహుమతులు, విభజన పత్రాల్లో 100 శాతం ఆటో-మ్యూటేషన్ తీసుకొచ్చాం. ఇకపై పాస్‌బుక్ కోసం ప్రజలు అధికారుల చుట్టూ తిరగాల్సిన పనిలేదు. ఆస్తి రిజిస్ట్రేషన్ కాగానే, ప్రింట్ చేసిన పాస్‌బుక్‌ను నేరుగా యజమాని ఇంటికి పంపాలి" అని అధికారులను ఆదేశించారు.

వారసత్వ ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను కూడా సులభతరం చేశామని, స్లాట్ బుకింగ్ విధానంతో గంటల తరబడి నిరీక్షించే అవసరం లేకుండా చేశామని పేర్కొన్నారు.

**కన్నతల్లిని కోర్టుకీడ్చిన వ్యక్తి ప్రజలకు ఆదర్శం కాదు**

గత వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "గత ప్రభుత్వంలో ప్రజల భూములపై కన్నేసి కబ్జాలు చేశారు. రికార్డులు తారుమారు చేసి ప్రతీ గ్రామంలో భూ వివాదాలు సృష్టించారు. అధికారం ఉందని పట్టాదారు పాస్‌పుస్తకాలపై, సరిహద్దు రాళ్లపై కూడా తమ బొమ్మలు వేసుకుని వందల కోట్ల ప్రజాధనాన్ని

దుర్వినియోగం చేశారు. వారు అధికారం నుంచి దిగిపోయినా వారి పాపాలు, అక్రమాలు ఇంకా వెంటాడుతున్నాయి. అంతలా రెవెన్యూ వ్యవస్థను నాశనం చేశారు. కన్నతల్లిని కోర్టుకీడ్చిన వ్యక్తి ప్రజలకు ఆదర్శం కాదు" అని పరోక్షంగా జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కుటుంబ సభ్యుల మధ్య ఆస్తి వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని, కక్షలకు దూరంగా గౌరవంగా బతకాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి, గొట్టిపాటి రవికుమార్, పలువురు ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కేరళ, అసోం, పుదుచ్చేరిలో ముగిసిన పోలింగ్...

# ఫలితాలపై సర్వత్రా ఆసక్తి

కేరళ, అసోం రాష్ట్రాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంత వాతావరణంలో ముగిసింది. మూడు ప్రాంతాల్లోనూ ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ అధికారికంగా ముగిసినప్పటికీ, పలు కేంద్రాల్లో ఓటర్లు క్యూలలో వేచి ఉండటంతో వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. దీంతో తుది పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ ఎన్నికల ఓట్ల లెక్కింపును మే 4వ తేదీన చేపట్టనున్నారు.

**కేరళలో గెలుపుపై ఎవరి ధీమా వారిదే**

ప్రజాస్వామ్య పండుగగా అభివర్ణించే ఎన్నికల పర్వానికి కేరళలో గురువారం సాయంత్రం 6 గంటలకు అధికారికంగా తెరపడింది. రాష్ట్రంలోని 140 అసెంబ్లీ స్థానాలకు జరిగిన పోలింగ్‌లో సాయంత్రం 5 గంటల సమయానికి 75.01 శాతం ఓటింగ్ నమోదైంది. కోజికోడ్ జిల్లాలో అత్యధికంగా 77.63 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో 75.75 శాతం పోలింగ్ నమోదవగా, ఈసారి కూడా తుది సంఖ్య 80 శాతం మార్కును దాటుతుందా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. అదే జరిగితే, 1987 తర్వాత 80 శాతం ఓటింగ్ దాటడం ఇదే తొలిసారి అవుతుంది. పోలింగ్ ముగియడంతో, ఇప్పుడు అందరి దృష్టి మే 4న జరగబోయే ఓట్ల లెక్కింపుపైనే ఉంది. రాబోయే ఐదేళ్లపాటు రాష్ట్ర సచివాలయాన్ని ఎవరు శాసిస్తారనే దానిపై ఉత్కంఠ నెలకొంది. ముఖ్యమంత్రి పినరయి విజయన్ నేతృత్వంలోని అధికార లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్), తమ ప్రస్తుత 99 సీట్ల కంటే ఎక్కువ స్థానాలు గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేసింది. మరోవైపు, కాంగ్రెస్ సీనియర్ నేత ఏకే ఆంటోనీ, వీడీ సతీశన్ వంటి నేతల సారథ్యంలోని ప్రతిపక్ష యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్), 100 సీట్ల మార్కును దాటి అధికారంలోకి వస్తామని ధీమాగా చెబుతోంది. ఈ రెండు కూటములకు భిన్నంగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ హంగ్ అసెంబ్లీ ఏర్పడుతుందని అంచనా వేశారు. 2016లో ఒక్క సీటు గెలిచి, 2021లో దాన్ని కోల్పోయిన బీజేపీ అంచనాలు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేపుతున్నాయి.

**పుదుచ్చేరిలో రికార్డు బ్రేకింగ్ పోలింగ్**

మరోవైపు, 30 అసెంబ్లీ స్థానాలున్న పుదుచ్చేరిలో రికార్డు స్థాయి ఓటింగ్ నమోదైంది. సాయంత్రం 5 గంటలకే 86.92 శాతం పోలింగ్ నమోదవడం విశేషం. ఇది 2006లో నమోదైన 86 శాతం రికార్డును అధిగమించింది. తుది పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశం ఉంది. మొత్తం 9.5 లక్షల మంది ఓటర్లు ఉండగా, వీరిలో మహిళా ఓటర్లే అధికం.

అధికార ఎన్డీఏ కూటమి (ఏఐఎన్ఆర్సీ నేతృత్వంలో), ప్రతిపక్ష ఇండియా కూటమి (కాంగ్రెస్, డీఎంకే, వీసీకే) మధ్య ప్రధాన పోటీ నెలకొంది. వీరితో పాటు నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవ?ఈ), సీమాన్ నేతృత్వంలోని నామ్ తమిళ్ కట్చి (ఎన్టీకే) కూడా బరిలో నిలవడంతో పోటీ ఆసక్తికరంగా మారింది.

**అసోం, ఇతర ఉప ఎన్నికల్లోనూ భారీగా ఓటింగ్**

అసోంలోని 126 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో సాయంత్రం 5 గంటల వరకు 84.42% పోలింగ్ నమోదైంది. సౌత్ సల్మారా మంకాచార్ జిల్లాలో అత్యధికంగా 94.08% ఓటింగ్ నమోదైంది. ఇక వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. కర్ణాటకలోని బాగల్‌కోట్‌లో 65.68%, దావణగెరె సౌత్‌లో 63.04%, నాగాలాండ్‌లోని కోరిడాంగ్ స్థానంలో 80.62%, త్రిపురలోని ధర్మనగర్‌లో 79.84% పోలింగ్ నమోదైంది. ప్రస్తుతం మూడు రాష్ట్రాల్లోని అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. మే 4వ తేదీ ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుండగా, మధ్యాహ్నానికి ఫలితాలపై స్పష్టత రానుంది. అప్పటి వరకు ఉత్కంఠ కొనసాగనుంది.

# చంద్రబాబు విజన్, లోకేశ్ కృషి ఫలితం

- మొదటి పేజి తరువాయి

ఆయన అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కాపులుప్పాడ సమీపంలో 601 ఎకరాల విస్తీర్ణంలో ఈ గూగుల్ ప్రాజెక్టు రూపుదిద్దుకోనుందని తెలిపారు. 2028 జూలై నాటికి ఇది పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభిస్తుందని, దేశంలోనే తొలి 1 గిగావాట్ సామర్థ్యం గల ఏఐ హబ్‌గా విశాఖ అవతరించనుందని వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు రావడమే కాకుండా, ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పల్లా ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికత, సాంకేతికతపై ఆయనకున్న పట్టు వల్లే గూగుల్ వంటి ప్రపంచస్థాయి సంస్థలు ఏపీ వైపు చూస్తున్నాయని కొనియాడారు. ఈ భారీ పెట్టుబడి రాష్ట్రానికి రావడంలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ కృషి, పట్టుదల కీలక పాత్ర పోషించాయని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఆయన నిరంతర ప్రయత్నాల వల్లే ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చిందని అన్నారు. ఈ డేటా సెంటర్‌తో ఉత్తరాంధ్ర ప్రాంతం మొత్తం ఒక టెక్నాలజీ హబ్‌గా మారుతుందని, రహదారులు, విద్యుత్, నీటి సరఫరా వంటి మౌలిక వసతులు శరవేగంగా అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. స్థానిక యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ లభించి, ప్రపంచస్థాయి టెక్నాలజీపై పనిచేసే అనుభవం దక్కుతుందని, తద్వారా అంతర్జాతీయంగా అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ పారదర్శక విధానాలు, పెట్టుబడులకు కల్పిస్తున్న అనుకూల వాతావరణం వల్లే గ్లోబల్ ఇన్వెస్టర్లు ముందుకు వస్తున్నారని తెలిపారు. ఈ ప్రాజెక్టును అడ్డుకోవడానికి ఎన్నో ప్రతికూల శక్తులు ప్రయత్నించాయని, అయినప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో వాటన్నింటినీ అధిగమించి అభివృద్ధి దిశగా సాగుతున్నామని పల్లా అన్నారు.

ఇది కేవలం ఒక డేటా సెంటర్ కాదని, ఉత్తరాంధ్ర యువత భవిష్యత్తుకు, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి మార్గం చూపే ఒక మహత్తర అవకాశమని ఆయన అభివర్ణించారు. "విజన్ ఆంధ్రప్రదేశ్" లక్ష్య సాధనలో గూగుల్ పెట్టుబడులు ఒక కీలక మైలురాయిగా నిలిచిపోతాయని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

## శత్రువులు మాపై విజయం సాధించలేరు

తమపై ఆంక్షలు విధించిన శత్రువులు విజయం సాధించలేరని ఇరాన్ అణు ఇంధన సంస్థ అధిపతి మొహమ్మద్ ఎస్లామీ అన్నారు. కాల్పుల విరమణ ప్రతిపాదనల్లో యురేనియం శుద్ధి అంశాన్ని అమెరికా వ్యతిరేకిస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ, అణు ఇంధనాన్ని పరిరక్షించుకోవడం తమ హక్కు అని స్పష్టం చేశారు. ఇరాన్ హక్కుల పరిరక్షణ అత్యవసరమని వ్యాఖ్యానించారు. అమెరికాతో జరిపే ఎటువంటి కాల్పుల విరమణ చర్చల్లోనూ తమ హక్కుల పరిరక్షణే అత్యవసర అంశంగా ఉండాలని చెప్పారు. తమపై ఆంక్షలు విధిస్తే అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. రెండు రోజుల క్రితం అమెరికా, ఇరాన్ దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించిన విషయం తెలిసిందే. అయితే లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడితో ఉద్రిక్త పరిస్థితులు తిరిగి తలెత్తాయి.

## చేయాల్సింది పాదయాత్ర కాదు... ఆత్మవిమర్శన యాత్ర: జగన్ పై షర్మిల ఫైర్

ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, తన సోదరుడు జగన్ పై తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు. వైఎస్ రాజశేఖర రెడ్డి చారిత్రాత్మక పాదయాత్ర చేపట్టి నేటికి 23 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, జగన్ విధానాలను, వైఎస్సార్ ఆశయాలను పోలుస్తూ షర్మిల సూటి ప్రశ్నలతో విరుచుకుపడ్డారు. తండ్రి పేరును పార్టీలో పెట్టుకుని, ఆయన ఆశయాలకు పూర్తిగా వ్యతిరేకంగా జగన్ పనిచేస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. "ఇవాళ ఏప్రిల్ 9! సరిగ్గా 23 సంవత్సరాల క్రితం మన తండ్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి గారు, అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో పాదయాత్ర అనే మహాయజ్ఞం మొదలుపెట్టారు. పేదల బాగు కోసం, బడుగుల మంచి కోసం, సకల జనుల సంక్షేమ మహాయాగానికి నాడు ఆయన శ్రీకారం చుట్టారు. ఆయన ఈ పాదయాత్ర ఒక కాంగ్రెస్ సైనికునిగా, నాయకునిగా, పీసీసీ అధ్యక్షునిగా ప్రారంభించారు. ఆ తర్వాత అయన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చి ముఖ్యమంత్రిగా చిరస్థాయిగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారు. మరి అటువంటి తండ్రికి కుమారునిగా, పార్టీ పేరులో ఆయన పేరును పొందుపర్చి మీరు నేడు చేస్తున్నది ఏమిటి? ఆజన్మాంతం పేదలు, దళితులు, మైనారిటీలు, మహిళలు, రైతులు, ఎస్టీలు, వీరి కోసం తపించి, తన పాలనలో వీరికోసం ఎన్నో పథకాలను రచించిన ఆయన ఎక్కడ, నేడు ఫాసిస్టు శక్తులకు తలవంచి వాళ్ళ క్యాపిటలిస్టు పోకడలకు దాసోహం అయిన మీరెక్కడ? లౌకికవాదాన్ని తన ఊపిరిలో నింపుకుని, అన్ని వర్గాలవారిని సమానంగా ఆదరించి, ప్రజల ఐక్యత కోసం పాటుపడింది వైఎస్సార్, మరి అయన తనయునిగా మీరు నేడు చేస్తున్నది ఏమిటి? మతోన్మాద బీజేపీ దగ్గర కేసులకు, రాజకీయ భవిత కోసం భయపడి మోకరిల్లడం. ఇది ఎంత వరకు ధర్మం? బీజేపీ ప్రతి చర్యలో దళిత, మైనారిటీ వ్యతిరేక పోకడలు ఉన్నాయ్. వక్ఫ్ చట్టం అయితేనేమి, దళిత క్రిస్టియన్ రిజర్వేషన్లు ఐతేనేమి, ఎఫ్ సీఆర్ఏ చట్టం అయితేనేమి, బుల్ డోజర్ రాజకేయాలితేనేమి. వీటన్నిటికి గల్లీలో మౌనం వహించి, ఢిల్లీలో బేషరతు మద్దత్తు ప్రకటించిన మీరా ఆయనకు నివాళి అర్పించేది ఇవాళ? ఆయనబతికుంటే ఇవి హర్షించేవారా? ఇది ఆయన ఆదర్శాలకు, అభిమతాలు పూర్తి వ్యతిరేకం కదా?

ఇక మీ ఐదేళ్ల పాలనలో సభ్యసమాజం సిగ్గుపడేలా దళితుల మీద, మహిళల మీద జరిగిన దాడులు, చివరికి మైనార్టీల మీద కూడా జరిగిన అక్రమాలు, ఇవన్నీ రాజశేఖర రెడ్డిగారి ఆత్మ క్షోభించే పనులు కాదంటారా? అణువణువునా రాజశేఖర రెడ్డిగారి పాలనకు, ఆలోచనలకూ భిన్న ధ్రువంగా ఉంటూ మీరు ఇవాళ అయన పాదయాత్రను తల్చుకుని నివాళులు అర్పించడం హాస్యాస్పదంగా ఉంది. మొన్న ప్రకటించినట్టు మీరు చేయాల్సింది పాదయాత్ర కాదు, ఆత్మవిమర్శన యాత్ర" అంటూ షర్మిల పేర్కొన్నారు.

## పవన్ ఖేరా అరెస్ట్‌పై ఉత్కంఠ... తీర్పు రిజర్వ్ చేసిన తెలంగాణ హైకోర్టు

కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరాకు అరెస్ట్ నుంచి తాత్కాలిక ఊరట లభిస్తుందా లేదా అనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ భార్య రినికి భూయాన్ శర్మపై పరువు నష్టం కలిగించే ఆరోపణలు చేశారన్న కేసులో, తనను అరెస్ట్ చేయకుండా మధ్యంతర రక్షణ కల్పించాలని కోరుతూ పవన్ ఖేరా దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు గురువారం తన తీర్పును రిజర్వ్ చేసింది. జస్టిస్ కె. సుజన శుక్రవారం ఈ తీర్పును వెలువరించే అవకాశం ఉంది.

అసోం పోలీసులు నమోదు చేసిన కేసు నేపథ్యంలో, అక్కడి కోర్టులను ఆశ్రయించేందుకు వీలుగా తనకు ట్రాన్సిట్ యాంటిసిపేటరీ బెయిల్ మంజూరు చేయాలని ఖేరా తన పిటిషన్‌లో కోరారు. ఖేరా తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ, అసోం పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్యేనని ఆరోపించారు. అయితే, అసోం అడ్వకేట్ జనరల్ దేవాజిత్ సైకియా ఈ వాదనలను వ్యతిరేకించారు. ఢిల్లీ నివాసి అయిన ఖేరా, హైదరాబాద్‌లో ముందస్తు బెయిల్ పిటిషన్ ఎందుకు దాఖలు చేశారో సరైన కారణాలు చూపలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రినికి భూయాన్ శర్మకు పలు విదేశీ పాస్‌పోర్టులు, విదేశాల్లో ప్రకటించని ఆస్తులు ఉన్నాయని పవన్ ఖేరా ఇటీవల ఓ ప్రెస్‌మీట్‌లో సంచలన ఆరోపణలు చేశారు. దీనిపై అసోం పోలీసులు ఆయనపై పరువునష్టం, ఫోర్జరీ, నేరపూరిత కుట్ర వంటి భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని 14 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో మంగళవారం ఢిల్లీలోని ఖేరా నివాసానికి వెళ్లగా ఆయన అందుబాటులో లేరు. మరోవైపు, హైదరాబాద్‌లోని ఆయన భార్య నీలిమ ఇంటి వద్ద పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో, అజ్ఞాతం నుంచి పవన్ ఖేరా ఒక వీడియో ప్రకటన విడుదల చేశారు. ఆయనపై, ఆయన భార్యపై వచ్చిన ఆరోపణలకు సీఎం సమాధానం చెప్పాలే తప్ప, పోలీసులను అడ్డుపెట్టుకోవడం సరికాదని అన్నారు. ఇలాంటి బెదిరింపులకు భయపడనని, రాహుల్ గాంధీ సైనికుడిగా ప్రశ్నలు అడుగుతూనే ఉంటానని స్పష్టం చేశారు.

## లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు... హెజ్బొల్లా చీఫ్ మేనల్లుడి హతం

లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) దాడులను తీవ్రతరం చేసింది. హెజ్బొల్లా చీఫ్ నయీమ్ ఖాసిం మేనలుడు అలీ యూసఫ్ హర్షిని బీరుట్‌లో హతమార్చినట్లు ఐడీఎఫ్ నేడు ప్రకటించింది. హర్షి... నయీమ్ ఖాసింకు వ్యక్తిగత కార్యదర్శి కూడా. అమెరికా, ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన మరుసటి రోజే ఈ దాడి జరగడం ఉద్రిక్తతలకు దారితీసింది.

ఈ మేరకు 'ఎక్స్'లో ఐడీఎఫ్ ఒక ప్రకటన విడుదల చేసింది. ఖాసిం కార్యాలయ నిర్వహణలో, భద్రత కల్పించడంలో హర్షి కీలక పాత్ర పోషించాడని, అతడు అత్యంత సన్నిహితుడు, వ్యక్తిగత సలహాదారు అని తెలిపింది. ఈ దాడితో పాటు, లిటాని నదికి దక్షిణంగా ఆయుధాలను తరలించడానికి హెజ్బొల్లా ఉపయోగించే రెండు కీలక క్రాసింగ్‌లతో పాటు, దక్షిణ లెబనాన్‌లో 10 ఆయుధ నిల్వ కేంద్రాలు, లాంచర్లు, కమాండ్ సెంటర్లను కూడా ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ పేర్కొంది. ఉత్తర ఇజ్రాయెల్ భద్రత విషయంలో రాజీపడబోమని, హెజ్బొల్లాపై దాడులను మరింత కఠినంగా కొనసాగిస్తామని ఐడీఎఫ్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఈయల్ జమీర్ స్పష్టం చేశారు. ప్రతి కార్యాచరణ అవకాశాన్ని ఉపయోగించుకుంటామని ఆయన హెచ్చరించారు. కాగా, లెబనాన్ పై దాడుల వీడియోను ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు. "మా సందేశం సుస్పష్టం... ఎవరైతే ఇజ్రాయెల్ పౌరులపై దాడులకు పాల్పడతారో వారిని నాశనం చేస్తాం" అంటూ తన ట్వీట్ లో పేర్కొన్నారు.

## సెల్ఫీ మోజులో విషాదం... జలపాతంలో పడి ముగ్గురు విద్యార్థినుల మృతి

- మొదటి పేజి తరువాయి

కోల్పోయారు. ఈ హృదయ విదారక ఘటన అనంతగిరి మండలం మూలగుమ్మి సమీపంలోని జలపాతం వద్ద జరిగింది. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లోకి వెళితే, హుకుంపేట మండలం జుంబువలస గ్రామానికి చెందిన త్రిష (17), రత్నకుమారి (16), పవిత్ర (16) ఇటీవల ఇంటర్మీడియట్ పరీక్షలు రాశారు. మరో స్నేహితురాలు అంజలితో కలిసి నలుగురూ అనంతగిరిలోని జలపాతాన్ని చూసేందుకు వెళ్లారు. అక్కడ జలపాతం అంచున నిలబడి సెల్ఫీ దిగుతుండగా, ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడిపోయారు. ఈ ప్రమాదంలో త్రిష, రత్నకుమారి, పవిత్ర అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన అంజలిని స్థానికులు గమనించి లుంగపర్తి ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఒక్కసారిగా ముగ్గురు బాలికలు మృతి చెందడంతో వారి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

## నారా లోకేష్‌కు తొలి శుభలేఖ -- తన పెళ్లికి ఆహ్వానించిన రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్

**పాడేరు, పెన్ పవర్, ఏప్రిల్ 9:**అమరావతి ఉండవల్లి నివాసంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాడేరు లో మే 13వ తేదీన జరగనున్న తన వివాహానికి సంబంధించి తొలి శుభలేఖను మంత్రివర్యులకు అందజేసి తన పెళ్లికి ఆహ్వానించారు.

ఆహ్వానాన్ని సాదరంగా స్వీకరించిన నారా లోకేష్ , కార్యక్రమానికి తప్పకుండా హాజరవుతానని హామీ ఇచ్చారు.



## ఏ పి ఎం ఎస్ ఎం ఇ చైర్మన్ డైరెక్టర్ల సమావేశం





- 45 ఎం ఎస్ యం ఈ పార్కుల నిర్మాణం,7500 ఉద్యోగాల రూపకల్పనకు 500 కోట్ల నిధులు విడుదలకు ఆమోదం
- ఏపీ ఎం ఎస్ ఎం ఇ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్
- సమావేశంలో పాల్గొన్న విశాఖ ఏపీఎంఎస్ఎంఇ డైరెక్టర్లు

**విశాఖ తూర్పు,పెన్ పవర్, ఏప్రిల్ 9:**అమరావతి లో ఏపీ ఎం ఎస్ ఎం ఈ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్,సి ఓ విశ్వ సమక్షంలో గురువారం అమరావతి ఏపీ ఎం.ఎస్.ఎం.ఇ కార్యాలయంలో బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ సమావేశం నిర్వహించారు,సమావేశంలో లో విశాఖపట్నం నుంచి ఎం ఎస్ ఎం ఈ డైరెక్టర్స్ ముగడ రాజారావు,నీలాపు విజయనంద రెడ్డి, ఇతర జిల్లాలకు చెందిన 11 మంది డైరెక్టర్స్ పాల్గొన్నారు,

21వ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ మీటింగ్ లో సిపిసిఎంఇఫ్ ప్రోగ్రాంకు 300 కోట్లు నిధులు విడుదలకు ఆమోదం తెలిపారు, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏపీ సి డి పి 10.1.2026 ప్రారంభించి, బడ్జెట్లో 200 కోట్లను రాష్ట్రంలో 45 ఎంఎస్ఎమ్ ఈ పార్కులు నిర్మించడానికి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు ఆమోదించారు. దీని ద్వారా 7500 ఉద్యోగాల కల్పనకు రూపకల్పన చేశారని పీఎం విశ్వకర్మ యోజన పథకం నుంచి ఎం ఎస్ ఎం ఈ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించడానికి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు ఆమోదం తెలిపారు.

## జీకే వీధి మండలంలో హౌస్ లిస్టింగ్ ఆపరేషన్స్ కోసం శిక్షణ



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఏప్రిల్ 9:**2027 జనాభా గణనలో భాగంగా మొదటి దశలో చేపట్టే హౌస్ లిస్టింగ్ ఆపరేషన్స్ (మే 1-–31) కోసం జీకే వీధి మండలంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ హెచ్. అన్నాజీ రావు తెలిపారు. ఈ నెల 13 నుంచి జీకే వీధి ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూల్‌లో 97 మంది ఎన్యూమరేటర్లు మరియు 21 మంది సూపర్‌వైజర్లకు మూడు రోజుల శిక్షణ ఇవ్వబడుతుంది. ఈసారి గణకులుగా పూర్తిగా సచివాలయం సిబ్బందిని ఉపయోగించడం జరుగుతుంది. అదనంగా, ఈ నెల 16 నుంచి 30 వరకు ప్రజలకు సెల్ఫ్ ఎన్యూమరేషన్ చేసుకోవడానికి సౌలభ్యం కూడా కల్పించబడుతుంది అని తహసీల్దార్ హెచ్.అన్నాజీ రావు వెల్లడించారు.ఈ హౌస్ లిస్టింగ్ ఆపరేషన్స్ ద్వారా గ్రామాల నివాసాలు, కుటుంబాల వివరాలు సమగ్రంగా సేకరించబడతాయి.

## కేజీహెచ్ ఎస్టి సెల్ ఉద్యోగుల బదిలీ ఉత్తర్వులు రద్దు



### జెడ్పీ చైర్‌పర్సన్ జోక్యంతో ఉపశమనం

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఏప్రిల్ 09 :**విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ హాస్పిటల్ లోని ఎస్టి సెల్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న నలుగురు ఉద్యోగులను అల్లూరి సీతారామరా జు జిల్లాకు ఆకస్మికంగా బదిలీ చేయాలని సం బంధిత అధికారులు ఉత్తర్వులు జారీ చేయడం కలకలం రేపింది. ఈ నిర్ణయంపై వెంటనే స్పందిం చిన అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం విశాఖపట్నం జిల్లా కార్యవర్గం, జెడ్పీ చైర్‌పర్సన్ శ్రీమతి జె. శుభద్రను కలిసి తమ అభ్యంతరాలను వ్యక్తం చేసింది. ఈ సందర్భం గా సంఘం ప్రతినిధులుఎస్టి సెల్ విభాగం ప్రా ముఖ్యతను వివరించారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల నుండి వైద్య సేవల కోసం వచ్చే ప్రజ లకు ఈ విభాగం ఎంతో కీలకమని, సిబ్బంది తగ్గితే సేవలు దెబ్బతింటాయని తెలిపారు. అందువల్ల, ప్రస్తుత సిబ్బందిని యథాతథంగా కొనసాగిస్తూ సేవలను మరింత బలోపేతం చేయాలని కోరారు.

ఈ విషయాన్ని గంభీరంగా పరిగణించిన జెడ్పీ చైర్‌పర్సన్ జె. శుభద్ర వెంటనే ఏ ఎస్ ఆర్ జిల్లా కలెక్టర్ మరియు సంబంధిత ప్రాజెక్ట్ అధికారు లతో ఫోన్ ద్వారా మాట్లాడి పరిస్థితిని వివరిం చారు. వారి సహకారంతో ఉద్యోగుల ఆకస్మిక బదిలీ ఉత్తర్వులను రద్దు చేయించడంలో విజయవంతమయ్యారు.

దీనిపై సంఘం అధ్యక్షుడు సోనయా అప్పలరా జు, ప్రధాన కార్యదర్శి కటారి శోభన్ కుమార్‌తో పాటు ఎస్టి సెల్ ఉద్యోగులు సంధ్యా తదితరు లు జెడ్పీ చైర్‌పర్సన్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## కళాభారతిలో ఘనంగా పైడా కౌషిక్ నాటకోత్సవాలు -- ఐదు రోజుల సాంఘిక నాటికల మహోత్సవానికి రంగం సిద్ధం



**విశాఖ, ఏప్రిల్ 9:(పెన్ పవర్)**కళా ప్రియులను అలరించేందుకు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "కీ॥శే॥ పైడా కౌషిక్ నాటకోత్సవాలు -- 2026"లో భాగంగా 21వ రాష్ట్రస్థాయి ఆహ్వాన సాంఘిక నాటికల పోటీలకు సంబంధించి ప్రెస్‌మీట్ గురువారం విశాఖపట్నంలోని కళాభారతి (ఏసీ) ఆడిటోరియంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా వి.ఎమ్.డి.ఎ. మరియు నాటకోత్సవాల అధ్యక్షులు మంతెన సత్యనారాయణ రాజు మాట్లాడుతూ, గత 21 సంవత్సరాలుగా నిరంతరంగా జరుగుతున్న ఈ నాటకోత్సవాలు ఈ ఏడాది ఏప్రిల్ 12 నుండి 16 వరకు ఐదు రోజులపాటు జరుగనున్నట్లు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన 38 నాటికలలోంచి 9 ఉత్తమ నాటికలను ఎంపిక చేసినట్లు చెప్పారు. తొలి నాలుగు రోజుల్లో రోజుకు రెండు నాటికలు, చివరి రోజు ఒక నాటిక ప్రదర్శన అనంతరం బహుమతి ప్రదానోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు.

నాటకోత్సవాల ప్రధాన కార్యదర్శి డా. జి.ఆర్.కె. ప్రసాద్ (రాంబాబు) మాట్లాడుతూ, పాల్గొనే స్థానికేతర బృందాలకు రూ.16,000 పారితోషికంతో పాటు రూ.4,000 రవాణా భత్యం, అలాగే ప్రదర్శన రోజున ఉచిత వసతి కల్పించనున్నట్లు తెలిపారు. స్థానిక బృందాలకు రూ.16,000తో పాటు రూ.2,000 కన్వేయన్స్ అందజేస్తామని చెప్పారు.

పోటీలలో విజేతలకు ఆకర్షణీయమైన నగదు బహుమతులు ప్రకటించారు. ఉత్తమ నాటికకు రూ.20,000, ద్వితీయానికి రూ.15,000, తృతీయానికి రూ.12,000, చతుర్థానికి రూ.10,000తో పాటు జ్ఞాపికలు అందజేయబడతాయి. అదనంగా 12 వ్యక్తిగత బహుమతులు, మూడు జ్యూరీ అవార్డులు, బాల నటీనటులకు ప్రోత్సాహక బహుమతులు కూడా అందజేయనున్నట్లు తెలిపారు. ప్రతి నాటిక రచయిత, దర్శకులకు ప్రత్యేక సర్టిఫికెట్లు ఇవ్వబడతాయని వెల్లడించారు.

నాటకోత్సవాల మహారాజపోషకులు పైడా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, ఈ ఉత్సవాలకు తన సహకారం కొనసాగుతుందని తెలిపారు.

ప్రేక్షకులకు అన్ని రోజులు ఉచిత ప్రవేశం కల్పించబడగా, ప్రతిరోజూ లక్కీ డ్రా ద్వారా బహుమతులు ఇవ్వనున్నారు. ఐదు రోజుల కూపన్లపై ప్రత్యేక బహుమతులు కూడా అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఛీఫ్ కన్వీనర్ డా. కె.జి. వేణు, ఎగ్జిక్యూటివ్ కన్వీనర్లు బొడ్డేటి జగన్రావు, పి. నరసింగరావు, ఛీఫ్ అడ్వైజర్ ఆచార్య బాబివర్ధన్ తదితరులు పాల్గొన్నారు. మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## మరణములోను వీడిపోని స్నేహం.





- జలపాతంలో జారీ ముగ్గురు
- స్నేహితులు మృతి

**హుకుంపేట,పెన్ పవర్ ఏప్రిల్ 8.** అల్లూరు సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం మారుమూల ప్రాంతం బూర్జ పంచాయతీ. గ్రామంలో జరుగుతున్న ఇటుకుల పండుగ సందర్భం పునస్కరించుకొని. పండుగ చివరి రోజు కావటంతో నలుగురు స్నేహితురాలు కలిసి. గురువారం సాయంత్రం గ్రామానికి దగ్గరలో ఉన్న. మలున్గుమ్మి జలపాతం సందర్శన కోసం వెళ్లారు అనంతరం

సరగా పోటోలు కోసం వెళ్ళిన ఆ నాలుగురు యువతులు ప్రమాదవశత్తు జలపాతంలో జారీపోయారు వారిలో ముగ్గురు ప్రమాద స్థలంలో మృతిచెందగా మరో బాలిక పరిస్థితి విషమంగా ఉందని గ్రామస్తులు తెలిపారు.వివరాలు ఇలా ఉన్నాయి.హుకుంపేట మండలం బూర్జ గ్రామపంచాయతీ పరిధి జుంబువాలస గ్రామం యువతీలు సాలెపు.రత్నకుమారి.16 సాలెపు.త్రిష.17 సాలెపు.పవిత్ర 16 మృతి చెందగా. అంజలి అనే మరో బాలిక పరిస్థితి విషమంగా ఉందని ఆ గ్రామ ప్రజలు తెలిపారు మల్లుగుమ్మి జలపాతంలో గురువారం మధ్యానం సుమారు 1:00 గంటలకు సెల్ఫీ పోటోలు తీసుకొనేందుకు వెళ్లిన నలుగురు యువతులు కాలుజారి జలపాతం లో మునిగిపోయారు.ముగ్గురు మృతిచెందరని స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకొన్న హుకుంపేట పోలీసులు,మరియు రెవెన్యూ అధికారులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నాం.అని ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతుదేహాలను అరకులోయ ఏరియా ఆసుపత్రికి తరలిచాం అని ఎస్ఐ అన్నారు.




## జిల్లా అభివృద్ధి ప్రతిపాదనలకు సీఎం సానుకూల స్పందన



- ప్రజా సంతృప్తిలో జిల్లాకు 4వ స్థానం
- జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి

**విజయనగరం టౌన్, పెన్ పవర్, ఏప్రిల్ 09**: జిల్లా అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన ప్రతిపాదనల పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి తెలిపారు. బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన జిల్లా సమీక్షా సమావేశం వివరాలను కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుండి ప్రాజెక్టులు, సాగునీటి కాలువలు, రహదారులు, ఆసుపత్రులు మరియు విద్యాసంస్థల బలోపేతానికి సంబంధించి సుమారు 30 కీలక ప్రతిపాదనలు అందాయని, వీటిపై ప్రజాప్రతినిధులతో చర్చించి, సాధ్యాసాధ్యాలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు.

పరిపాలనకు సంబంధించి ప్రజల సంతృప్తి స్థాయిలో విజయనగరం జిల్లా రాష్ట్రంలోనే నాలుగో ర్యాంకు సాధించిందని కలెక్టర్ ఈ సందర్భంగా వెల్లడించారు. మరింత మంచి ర్యాంకు సాధించాలన్నారని తెలిపారు. విద్యుత్, ఏపీఎస్ఆర్టీసీ, రిజిస్ట్రేషన్ల వంటి శాఖల్లో సేవల నాణ్యతను మరింత పెంచాలని సీఎం సూచించారని చెప్పారు. ముఖ్యంగా భోగాపురం విమానాశ్రయం నుండి విజయనగరం వరకు 'అవుటర్ రింగ్ రోడ్డు' నిర్మాణానికి సంబంధించి వీఎంఆర్‌డీఏ అధికారులతో చర్చించి త్వరితగతిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారని తెలిపారు.



ఈ సమావేశంలో జిల్లా ఇన్-ఛార్జ్ మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్, ఎమ్మెల్యేలు కిమిడి కళావెంకటరావు, కోండ్రు మురళీమోహన్, కోళ్ల లలితకుమారి, బేబీ నాయన, పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, లోకం నాగమాధవి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు మెరుగైన సేవలే లక్ష్యం

- ఏపి రైతులు అభివృద్ధికు పటిష్టమైన చర్యలు
- ఏప్రాూజా ద్వారా రుణాలు, విత్తనాలు సమయానికి అందించాలి
- డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున



**విజయనగరం టౌన్, పెన్ పవర్, ఏప్రిల్ 09**: రైతులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని విజయనగరం జిల్లా డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున పేర్కొన్నారు. గురువారం గంట్యాడ మండలంలోని పెంట శ్రీరాంపురం, బోనంగి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (ాూజా) మరియు గోదాంలను సందర్శించి అక్కడి కార్యకలాపాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సంఘాల్లో జరుగుతున్న ఆర్థిక లావాదేవీలు, ధాన్యం కొనుగోలు విధానం, నిల్వ సదుపాయాలపై సమగ్రంగా ఆరా తీశారు. గ్రామీణ స్థాయిలో ాూజా సంఘాలు రైతులకు స్వల్ప, మధ్యకాలిక రుణాలు, ఎరువులు, విత్తనాలు అందిస్తూ వ్యవసాయాభివృద్ధికి బలంగా నిలవాలని సూచించారు. రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందించడం, మద్దతు ధరతో పంటల కొనుగోళ్లు సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు తక్కువ వడ్డీపై రుణాలు అందించడంలో, సమయానికి అవసరమైన వ్యవసాయ ఇన్‌పుట్స్ అందించడంలో సంఘాలు చురుకుగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ాూజా నిధులతో నిర్మించిన గోదాంలలో కొన్ని నిరుపయోగంగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, వాటి ప్రస్తుత పరిస్థితులను పరిశీలించారు. అవసరమైన మౌలిక సదుపాయాలపై సభ్యుల నుంచి వివరాలు తెలుసుకుని, సమస్యల పరిష్కారానికి త్వరలోనే స్పష్టమైన ప్రణాళిక రూపొందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెంటశ్రీరాంపురం సొసైటీ చైర్మన్ కరక నారాయణమూర్తి, డైరెక్టర్లు గుల్లిపల్లి అవతారం, బర్ల భాస్కరరావు, బోనంగి సొసైటీ చైర్మన్ గోపిశెట్టి శంకరరావు, డైరెక్టర్లు గంగ్రేటి సత్యం, గులిశెట్టి దేవుడుబాబు, గంట్యాడ బ్యాంక్ సిబ్బంది సవిత, సుబ్రహ్మణ్యం, సొసైటీ సీఈఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

# నాణ్యతే ప్రధానంగా రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణం....





**పలాస ఏప్రిల్ 9 ( పెన్ పవర్)**రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణానికి సంబంధించి ఒక ప్రముఖ వార్తాపత్రికలో వచ్చిన కథనాన్ని ఏ. పి. టి. పి. సి చైర్మన్ వజ్జ బాబూరావు ఖండించారు. ఫ్లైఓవర్ నిర్మాణంలో లోపాలు ఉన్నాయని సోషల్ మీడియాలో మరియు కొన్ని వార్తా పత్రికల్లో వస్తున్న వార్తలు వాస్తవం కాదని ఆయన ఖండించారు.

**పిల్లర్ల తొలగింపునకు కారణం:**

అక్కడ రెండు పిల్లర్ల మధ్య ఎత్తులో తేడా రావడంతో, సుమారు 80 సెంటీమీటర్ల ఎత్తు పెంచేందుకు రైల్వే మరియు ఆర్ అండ్ బి అధికారుల సూచన మేరకు వాటిని రీవర్క్ చేయడం జరిగిందని బాబూరావు వివరించారు.

ఈ ప్రాజెక్టును ప్రభుత్వం చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, ఎక్కడా నాణ్యత విషయంలో రాజీ పడలేదని స్పష్టం చేశారు. స్థానిక ఇంజనీర్లు మరియు కాంట్రాక్టర్ల అభిప్రాయం తీసుకున్న తర్వాతే పనులు జరుగుతున్నాయని తెలిపారు.

స్థానిక ఎమ్మెల్యే శిరీష, పౌర విమానయాన శాఖ మంత్రి కిందిరాపు రామ్మోహన్నాయుడు , రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ని కలిసి సుమారు 43 - 44 కోట్ల రూపాయల నిధులు తీసుకువచ్చారని, ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే పాత్రికేయ మిత్రులు కూడా

క్షేత్రస్థాయి వాస్తవాలు తెలుసుకోకుండా తప్పుడు వార్తలు రాయడం వల్ల ఊరికి మరియు ఈ ప్రాంత అభివృద్ధికి నష్టం జరుగుతుందని, పాత్రికేయులు సహకరించాలని ఆయన కోరారు. మొత్తంగా, ఫ్లైఓవర్ నిర్మాణ పనులు సజావుగానే జరుగుతున్నాయని, చిన్న సాంకేతిక మార్పుల కోసం చేసిన పనులను లోపాలుగా చిత్రీకరించవద్దని బాబూరావు కోరారు చేశారు.

# 87వ వార్డ్ లో ఉన్న స్పోర్ట్స్ కాంప్లెక్స్ కు ఎంపీ నిధులు మంజూరు

- అధికారులతో స్థల పరిశీలనలో పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం



**కూర్మన్న పాలెం :పెన్ పవర్ ,ఏప్రిల్ 09** మహా విశాఖ నగర పాలక సంస్థ 87వ వార్డ్ పరిధి సిద్ధార్థ నగర్ కి ఆనుకొని ఉన్న నాలుగున్నర ఎకరాల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణపు పనులు జరుగుతున్నాయి.ఈ స్పోర్ట్స్ కాంప్లెక్స్ కు ఎంపీ ఫండ్స్ నండి ఇరవై లక్షలు నిధులు మంజూరు అయ్యాయని ఆ ఖర్చు నిమిత్తం ఏర్పాటు చేయబోయే షటిల్ కోర్టు, కబడ్డీ కోర్టుల స్థల పరిశీలన చేయుటకు డి. ఈ పోలీస్, ఏ . ఈ శ్రీనివాస్ రాష్ట్ర కార్యదర్శి బోండా జగన్నాథం ఆధ్వర్యంలో పరిశీలించారు . ఈ సందర్భంగా మాట్లాడుతూ మరో రెండు రోజుల్లో ఎర్త్ వర్క్ చేస్తారని జరగబోయే పనుల్లో నాణ్యత తగ్గకుండా పనులు పూర్తి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షుడు విజయరామరాజు, ప్రగడ దానయ్య, రాజేంద్ర ప్రసాద్, జాన్ రమేష్,ఈర్ల దేముడు,దాలయ్య, మూర్తి,పాల్, మంగా వరప్రసాద్,రమేష్ ఏ.ఈ మహాలక్ష్మి పాల్గొన్నారు.

# వెంకటరమణ మృతి పట్ల సంతాపం కుటుంబానికి ధైర్యం చెప్పిన జనసేన నేతలు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఏప్రిల్ 9:** గూడెం కొత్తవీధి మండలం పెదవలస గ్రామ పంచాయతీ పరిధిలోని చాపరతిపాలెం గ్రామానికి చెందిన జనసైనికుడు కసింకోట వెంకట రమణ మంగళవారం రాత్రి మృతి చెందడం ఆ ప్రాంతంలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ దుర్వార్త తెలుసుకున్న వెంటనే జనసేన పార్టీ నాయకులు ఆయన నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.జనసేన పార్టీ పాడేరు ఇంచార్జి రాష్ట్ర జానపద కళలు సృజనాత్మకత అకాడమీ చైర్మన్ డాక్టర్ వంపూరు గంగులయ్య ఆదేశాల మేరకు, అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీరవెంకట్ సహా పలువురు నాయకులు మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల ఆవేదనను చూసి నాయకులు కూడా భావోద్వేగానికి గురయ్యారు. "వెంకట రమణ ఇక లేరు కానీ, ఆయన కుటుంబం ఒంటరిగా లేదు. జనసేన పార్టీ ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటుంది" అని నాయకులు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ చైర్మన్ వసుపరి ప్రసాద్, మాజీ సర్పంచ్ జంబూ బాలరాజు, క్రిస్టియన్ మైనారిటీ జిల్లా అధ్యక్షులు వసుపరి తిమోతి, జనసేన పంచాయతీ అధ్యక్షులు విరోజీ త్రిమూర్తులు,మాజీ వార్డు మెంబర్ దారబాబు, వీరామహిళా నాయకురాలు కంకిపాటి సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.వెంకట రమణ మృతి జనసేన కుటుంబానికి తీరని లోటుగా పేర్కొంటూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని నాయకులు ఆకాంక్షించారు.

# పోషణ్ పఖ్వాడా ద్వారా పోషకాహార నిర్మూలన





- ఘనంగా పోషణ్ పఖ్వాడా పోస్టర్ ఆవిష్కరణ.
- ఐసిడిఎస్ సిడిపిఓ యు విమల కుమారి.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఏప్రిల్ 09.**అల్లూరి సీతారామరాజు జిల్లా, ముంచంగిపుట్టు మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఐసిడిఎస్ సిడిపిఓ విమల కుమారి ఆధ్వర్యంలో మండల ఎంపీడీవో ధర్మారావు, తహసిల్దార్ భాస్కర అప్పారావు చేతుల మీదుగా పోషణ్ పఖ్వాడా పోస్టర్ ఆవిష్కరణ గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ విమల కుమారి మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పోషణ్ అభియాన్ లో భాగంగా 8వ పోషణ్ పక్షోత్సవం 2026 ఏప్రిల్ 9 నుండి 23 వరకు దేశవ్యాప్తంగా నిర్వహించబడుతోందనీ, జీవితంలోని మొదటి ఆరు సంవత్సరాలలో మెదడు అభివృద్ధిని గరిష్ఠ స్థాయికి చేర్చడం అనే ముఖ్య ఇతివృత్తంతో పిల్లలు, గర్భిణీ స్త్రీలు, మరియు పాలిచ్చే తల్లులలో పోషకాహార లోపాన్ని నివారించి, పోషకాహార లోపాలు లేని సమాజాన్ని నిర్మించడం దీని ప్రధాన లక్ష్యం అన్నారు.

పోషణ్ పఖ్వాడా కార్యక్రమం ద్వారా 0-6 సంవత్సరాల పిల్లలు, కౌమార బాలికలు, గర్భిణీలు మరియు పాలిచ్చే తల్లులలో పోషకాహార లోపాన్ని నివారించి, పౌష్టికాహారంపై అవగాహన కల్పించడం జరుతుందని అన్నారు. 6 నెలల పిల్లలకు అన్నప్రాశన కార్యక్రమాలు గ్రోత్ మానిటరింగ్ (పిల్లల ఎత్తు, బరువు కొలవడం), సమతుల్య ఆహారంపై గ్రామస్థాయిలో అవగాహన సదస్సులు, ఆరోగ్యం మరియు శ్రేయస్సును పెంపొందించే పద్ధతులపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఏ ఒక్కరూ పోషక ఆహార లోపంతో బాధపడకూడదని, అంగన్వాడి కేంద్రం ద్వారా పాలు, గుడ్లు, నాణ్యమైన ఆహారం అందిస్తూ.. తల్లి బిడ్డ క్షేమంగా ఉండేందుకు వైద్యుల సూచన మేరకు నెలల వారీగా ఇంజక్షన్లను వేస్తున్నారన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులలో రక్తహీనత, బరువు లోపాలు లేకుండా అవసరమైన పోషక ఆహారం అందించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించడానికి అందరూ సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అనంతరం అంగన్వాడి కార్యకర్త సత్యలమ్మ మీడియాతో మాట్లాడుతూ.. అంగన్వాడి, సచివాలయం, మండల స్థాయిలో చిన్నారులకు గర్భస్థ స్థాయి నుంచి ఆరు సంవత్సరాలు వచ్చేంతవరకు పౌష్టిక ఆహారాన్ని అందించడానికి ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ సూపరిండెంట్ డాక్టర్ వి రమేష్, వైద్యులు ఆదిత్య, ధరణి సిహెచ్సి సిబ్బంది, అంగన్వాడి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అల్లూరి జిల్లాను జోన్ ఒకటిలోనే ఉంచాలి: డీటీఎఫ్ డిమాండ్



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఏప్రిల్ 9**:ఆంధ్రప్రదేశ్‌లో అమలులోకి వచ్చిన ప్రభుత్వ ఉద్యోగ నియామక ఉత్తర్వు--2025 మరియు బహుళ మండల వ్యవస్థ కారణంగా అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం జిల్లాల గిరిజనులకు అన్యాయం జరుగుతోందని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా అల్లూరి జిల్లాను జోన్--ఒకటి నుంచి జోన్--రెండులోకి మార్చడం వల్ల గిరిజన యువత విశాఖలోని ప్రభుత్వ, ప్రజా రంగ ఉద్యోగాలకు అర్హత కోల్పోతున్నారని తెలిపారు. విశాఖపట్నం ప్రధాన పారిశ్రామిక కేంద్రంగా ఉండి అనేక ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నప్పటికీ, ప్రస్తుత విధానం కారణంగా అల్లూరి గిరిజనులు వాటికి దూరమవుతున్నారని పేర్కొన్నారు. చారిత్రకంగా, భౌగోళికంగా విశాఖతో అనుసంధానం ఉన్న ఏజెన్సీ ప్రాంతాలను వేరుచేయడం అభివృద్ధికి ఆటంకమని అభిప్రాయపడ్డారు.అల్లూరి జిల్లాను తిరిగి జోన్--ఒకటిలో చేర్చాలని, గిరిజనులకు ప్రత్యేక అవకాశాలు కల్పించాలని, బహుళ మండల వ్యవస్థ ప్రభావాలపై సమీక్ష కమిటీ ఏర్పాటు చేయాలని డీటీఎఫ్ డిమాండ్ చేసింది. గిరిజనుల భవిష్యత్తు, హక్కుల పరిరక్షణ దృష్ట్యా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని సంఘం అధ్యక్షుడు ఎస్. గురుదొర, ప్రధాన కార్యదర్శి దేవుడు విజ్ఞప్తి చేశారు

# గూడెం కొత్తవీధిలో ప్రారంభమైన పోషణ పక్వాడ్ కార్యక్రమాలు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఏప్రిల్ 9:** మండల కేంద్రంలో గురువారం నుండి ఈనెల 23 వరకు పోషణ పక్వాడ్ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో గర్భవతులు మరియు జీరో నుండి రెండు సంవత్సరాల వయసు గల చిన్నారులపై ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించారు. డాక్టర్లు శివరం, రుశశ్రీ తెలిపినట్లుగా, మెదడు అభివృద్ధి గర్భావస్థలో 80% జరుగుతుందని, తల్లులు తగిన పోషకాహారం తీసుకోవడం అత్యవసరం అని సూచించారు. అలాగే, పిల్లలను చక్కెరకు దూరంగా ఉంచడం, స్క్రీన్ టైమ్ పరిమితం చేయడం, ఇంటి లోపల మరియు బయట ఆటలకు ప్రోత్సాహించడం అవసరమని వారు హితవు చెప్పారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్లు డి. వలసమ్మ, డి మోహిని, ఎల్ ఎస్ మాలతి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.పోషణ పక్వాడ్ ద్వారా తల్లులు, చిన్నారులు ఆరోగ్యకరంగా ఎదగడానికి కావలసిన అవగాహన కల్పించడం లక్ష్యం.

# ఈనెల 11 నుంచి 14 వరకు ఆత్మగౌరవ పోరాట దినాలు



**టెక్కలి, పెన్ పవర్ ఏప్రిల్ 9 :** ఈ నెల 11 నుంచి 14 వరకు సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిబా పూలే జయంతి, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతి సందర్భంగా దళిత, పీడిత కులాల ఆత్మగౌరవ పోరాట దినాలుగా పాటించనున్నామని కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బెలమర ప్రభాకర్ తెలిపారు. ఈమేరకు గురువారం టెక్కలి పట్టణం లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో దళిత, పీడిత, మైనార్టీలు మహిళలపై దాడులు జరుగుతున్నా అదే సామాజికవర్గాలకు చెందిన ప్రజా ప్రతినిధులు మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. అంబేద్కర్, పూలే ఆశయాలకు భిన్నంగా వ్యవహారిస్తున్నారని మండిపడ్డారు. పీడీత దళిత కులాల సమస్యలు చట్టసభల్లో కనీసం ప్రస్తావించడంలేదన్నారు. హక్కులు అడుక్కుంటే రావుఅనినిరంతరం పోరాటం ద్వారానే సాధించుకోవాలన్న అంబేద్కర్ మాటలను నిజం చేయాలన్నారు. కార్యక్రమంలో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు కోత ధర్మారావు, పడాల రాజు, పడాల హరి, పరిమిక శివ, ప్రతాప్, ఈశ్వరరావు, ముంజేటి చిన్న, విజయచంద్ర, హరీష్, కృష్ణ, త్రినాథ్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## వాస్తవాలు ప్రచారించండి! అభివృద్ధికి సహకరించండి.పట్టణ అధ్యక్షుడు నాగరాజు...



**పలాస, పెన్ పవర్. ఏప్రిల్ 9**:పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ టిడిపి అధ్యక్షుడు బడ్డ నాగరాజు మాట్లాడుతూ

ప్రధాన రహదారి అభివృద్ధి

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీతో పాటు వజ్రపుకొత్తూరు, నువ్వలరేవు వరకు రోడ్డు నిర్మాణానికి అనుమతులు లభించాయి. ఈ రోడ్డు సుమారు 16 కిలోమీటర్ల పొడవు మరియు 7 మీటర్ల వెడల్పుతో నిర్మించనున్నారు.

దీనికి సుమారు ?20 కోట్ల పైచిలుకు నిధులు కేటాయించారు.

రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కాలువలు, మధ్యలో సెంటర్ డివైడర్లు మరియు ప్రతి గ్రామం వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయనున్నారు.

ఇతర అభివృద్ధి పనులు

అక్కుపల్లి రోడ్డు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి సుమారు ?76 కోట్లు మంజూరయ్యాయని, పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని తెలిపారు.

?రైల్వే గ్రౌండ్ సమీపంలో కేంద్రీయ విద్యాలయం మంజూరైందని, ఇప్పటికే అడ్మిషన్ల ప్రక్రియ కూడా ప్రారంభమైందని పేర్కొన్నారు.

ఈ అభివృద్ధి పనులకు సహకరించినందుకు స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష గారికి, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు గారికి మరియు రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఆర్ఓబి పనుల్లో నాణ్యత లోపం ఉందని వస్తున్న వార్తలను నాగరాజు ఖండించారు. కేవలం సాంకేతిక కారణాల వల్ల చిన్న సమస్య వచ్చిందని, దయచేసి వాస్తవాలను ప్రచురించాలని పత్రికా ప్రతినిధులను కోరారు.

మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ప్రజలందరూ సహకరించాలని ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# జీకే వీధి మండల పరిషత్ అభివృద్ధి నిధులపై శ్వేత పత్రం విడుదల చేయాలి

**కూటమి నేతల డిమాండ్**



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఏప్రిల్ 9:**కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత జీకే వీధి మండలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని కావున జీకే వీధి మండల పరిషత్ అభివృద్ధి నిధులపై శ్వేత పత్రం విడుదల చేసి కూటమి ప్రభుత్వం విడుదల చేసిన జీకే వీధి మండల పరిషత్తు నిధులను ప్రజల ముందు ఉంచాలని జీకే వీధి మండల కూటమి నేతలు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పొత్తురు కొండల రావు, మండల జనసేన పార్టీ అధ్యక్షులు కొయ్యం బాలరాజు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి కొర్ర బలరాం, మాజీ మండల టిడిపి అధ్యక్షుడు ముక్కలి రమేష్,మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు సిద్ధార్థ మార్క్, మండల టిడిపి ఉపాధ్యక్షుడు పాడి శ్రీనివాస్, టిడిపి మాజీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి ముక్కలి మహేష్, టిడిపి నాయకులు వడేలు పాండురాజు, మాతే కామరాజు తదితరులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో రహదారి - గిరిజనుల నిరసన

- రాములు రోడ్డు మరమ్మతులకై నిరసన
- 20ఏళ్ల క్రితం నిర్మించిన రోడ్డు శిథిలావస్థలో అస్తవ్యస్తం.
- తక్షణమే నూతన రోడ్డు నిర్మాణం చేపట్టాలి.
- మండల గిరిజన సంఘం అధ్యక్షుడు ఎం ఎం శ్రీను.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఏప్రిల్ 09.** అల్లూరి జిల్లా, ముంచంగిపుట్టు మండలంలోని కించాయిపుట్టు పంచాయితీ పరిధి, జోలపుట్టుకెళ్ళే ప్రధాన రహదారి ఇందిరాకోలని నుండి దారపల్లి, ఇల్లోయిపాలెం మీదుగా రాములు వరకు పంచాయతీరాజ్ శాఖ రోడ్డు తక్షణమే మరమ్మతులు చేయాలని ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆదివాసి గిరిజనులు గురువారం రోడ్డు మీద కూర్చొని తీవ్ర నిరసన వ్యక్తం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షుడు ఎం ఎం శ్రీను మాట్లాడుతూ.. ఇందిరాకొలనీ నుండి రాముల వరకు గడచిన 20 సంవత్సరాల క్రితం నిర్మించిన రోడ్డు పూర్తిస్థాయిలో శిధిలావస్థకు చేరిందని, దీంతో రాకపోకలకు ప్రజలు, వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. రోడ్డు మీద 108 అంబులెన్స్, ఆటోలు, జీపులు, ద్విచక్ర వాహనాలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు నడుమ రాకపోకలు సాగిస్తున్నారనన్నారు. ప్రభుత్వ డిప్యూటీ సీఎం, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు స్పందించి తక్షణమే రాములు పిఆర్ రోడ్డు మరమ్మత్తులు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై గతంలో జిల్లా కలెక్టర్, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి సమక్షంలో పలు మార్లు గ్రీవెన్స్ లో అర్జీలు పెట్టుకున్న నేటికీ పరిష్కారం కాలేదని ఆయన తెలిపారు. మండల ప్రజా పరిషత్ అధికారి ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లిన ఎటువంటి స్పందన లేదన్నారు. ఇప్పటి కైన ప్రభుత్వం స్పందించి రాములు పిఆర్ రోడ్డు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కొత్తగా తారు రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. రోడ్డు సౌకర్యం కల్పించకపోతే అల్లూరు జిల్లా జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో దారపల్లి, రాములు పిసా క్లస్టర్స్ కార్యదర్శులు, ఉపాధ్యక్షులు కిల్లో నారాయణ, కంజ్య జయరాం, గ్రామస్తులు లోబో, రామ్మూర్తి, నారాయణ, ప్రసాద, మల్లేష్ తో పాటు నాలుగు గ్రామల ప్రజలు పాల్గొన్నారు.

## జనగణనలో ఒక్క ఇల్లు కూడా వదలొద్దు

- జిల్లా జనగణన అధికారి విశ్వేశ్వర నాయుడు




**పద్మనాభం, పెన్ పవర్, ఏప్రిల్ 09 :** జనగణన ప్రక్రియలో ఏ ఒక్క ఇల్లు కూడా మి గలకుండా ఖచ్చితంగా లెక్కించాలని జిల్లా జన గణన అధికారి ఎం. విశ్వేశ్వర నాయుడు అధికా రులకు సూచించారు. గురువారం పద్మనాభం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశ మందిరంలో ఎన్యు మరేటర్లు, సూపర్వైజర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ, 2011లో జరిగిన జనగణన తర్వాత 2021లో జరగాల్సి న లెక్కలు కోవిడ్ కారణంగా వాయిదా పడ్డా యని తెలిపారు. దేశంలో 1881లో మొదటి సారి జనగణన ప్రారంభమైందని, ప్రస్తుతం 16వ జనగణనకు సన్నాహాలు జరుగుతున్నాయని చెప్పారు. 2027లో జనగణన నిర్వహించేందు కు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోంద న్నారు. ఈ నేపథ్యంలో పద్మనాభం మండలంలో తొమ్మిది రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వ హిస్తున్నామని, ఇందులో పాల్గొన్న సిబ్బంది శిక్షణలో నేర్చుకున్న విషయాలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ఏప్రిల్ 16 నుంచి 30 వరకు గ్రామాల వారీగా వ్యక్తిగత వివరాలను వాట్సాప్ ద్వారా సేకరించనున్నట్లు తెలిపారు. మే 1 నుంచి 30 వరకు గృహ లెక్క లు నిర్వహించబడతాయని, ముందుగా ప్రతి గ్రామంలో ఇళ్ల సంఖ్యను నమోదు చేయనున్న ట్లు వెల్లడించారు. మండలంలో మొత్తం 89 మంది ఎన్యుమరేటర్లు, 17 మంది సూపర్వై జర్లు మూడు విడతలుగా ఈ శిక్షణ పొందుతు న్నారని చెప్పారు. ఈ శిక్షణను ఎల్ల అప్పారావు, కే. గణేష్, ఉపాధ్యాయులు అందిస్తున్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రశే ఖర్, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్యామల, వీ ఆర్వోలు మరియు ఇతర అధికారులు పాల్గొన్నా రు.

## మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ్ కార్యక్రమాలు ప్రారంభం




**చింత పల్లి,పెన్ పవర్,ఏప్రిల్ 9:** మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ సంవత్సరం ఏప్రిల్ 9 నుంచి 23 వరకు మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో 8వ పోషణ పక్వాడ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ కార్యక్రమంలో చిన్నారుల జీవన మొదటి ఆరు సంవత్సరాల్లో మెదడు, శారీరక అభివృద్ధిపై ప్రత్యేక అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టబడింది. సున్నా నుంచి రెండు సంవత్సరాల వయస్సులో చిన్నారుల మెదడు అభివృద్ధి 80% పూర్తవుతుందని, అందువల్ల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఈ దశలో ప్రత్యేక శ్రద్ధ చూపవలసిందని సీడీపీఓ శ్రీదేవి, సెక్టార్ సూపర్వైజర్ జయభారతి సూచించారు. చిన్నారులకు జంక్ ఫుడ్ ఇవ్వకుండా ఇంట్లో తయారుచేసిన పౌష్టికాహారాన్ని అందించడం, స్క్రీన్ టైమ్ తగ్గించడం, ఆటల ద్వారా శారీరక నైపుణ్యాలు అభివృద్ధి చేసుకోవడం, తల్లిదండ్రులు, పెద్దవారితో కలిసి సమయాన్ని గడపడం వంటి అంశాలపై అవగాహన కల్పించబడింది. లంబసింగి పీహెచ్సి లో డాక్టర్ దినేష్, ఆరోగ్య సిబ్బంది, గర్భవతులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. చౌడేపల్లి అంగన్వాడి కేంద్రంలో సెక్టార్ సూపర్వైజర్ ఎస్. గౌరి మరియు ఎమ్. లక్ష్మి కార్యక్రమాన్ని నిర్వహించారు.

## తొలి 1000 రోజులు కీలకం పోషణ పక్వాడకు శ్రీకారం



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఏప్రిల్ 09 :** జిల్లాలో బాలల ఆరోగ్య అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 23 వరకు నిర్వహించనున్న 8వ "పోషణ పక్వాడ" కార్యక్ర మానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఎం. అభి షిక్త్ కిశోర్ గురువారం తన కార్యాలయంలో సంబంధిత అధికారులతో కలిసి ఆవిష్కరించా రు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పిల్లల తొలి ఆరు సంవత్సరాలు వారి భవిష్యత్తును నిర్ణయించే కీలక దశగా పేర్కొన్నారు. ముఖ్యం గా గర్భధారణ నుంచి రెండేళ్ల వయస్సు వరకు ఉండే తొలి 1000 రోజుల్లో సరైన పోషకాహారం, శ్రద్ధ తీసుకుంటే శారీరక, మానసిక వికాసం మెరుగుపడుతుందని చెప్పారు. కుటుంబాల్లో ఆరోగ్యకర అలవాట్ల పెంపు, చిన్నారుల మెదడు అభివృద్ధికి అవసరమైన చర్యలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని వివరించారు. ఈ ఏడాది పోషణ పక్వాడలో పురుషుల భాగస్వామ్యానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులిద్దరూ కలిసి పిల్లల సంరక్షణలో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో తండ్రుల కోసం ప్రత్యేక వర్క్‌షాపులు, "సూపర్ డాడ్" రెసిపీ పోటీలు నిర్వహించనున్న ట్లు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలు మరియు కమ్యూనిటీ స్థాయిలో పలు వినూత్న కార్యక్ర మాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. "సుపోషి త జనని- స్వస్థ శిశు" అంశంపై తల్లి-శిశు పోష ణపై అవగాహన కార్యక్రమాలు, "జంక్ ఫుడ్ ఫ్రీ కమ్యూనిటీ" లక్ష్యంగా నుక్కడ్ నాటకాల ద్వా రా ప్యాకెట్ ఆహారాల దుష్ప్రభావాలపై ప్రచారం చేపడతామని తెలిపారు. అలాగే "స్వాప్ ది స్నాక్" వంటి కార్యక్రమాల ద్వారా ఆరోగ్యకర ఆహారపు అలవాట్లను ప్రోత్సహించనున్నారు.

3 నుంచి 6 సంవత్సరాల పిల్లల కోసం "ఖేల్-సే- సీఖ్" కార్యక్రమాలు, "టాయ్-అ-థాన్" పోటీలు, "స్టోరీ టైమ్ విత్ పాపా" వంటి కార్యక్రమాలు నిర్వహించి వారి మానసిక వికాసాన్ని ప్రోత్స హించనున్నట్లు చెప్పారు. పిల్లల్లో స్క్రీన్ టైమ్ తగ్గించేందుకు, అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు ను మరింత మెరుగుపరచేందుకు సమాజం నుంచి సహకారం అవసరమని కలెక్టర్ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చే యాలని సంబంధిత అధికారులకు ఆదేశించా రు.


ఈ కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ పీడీ రామలక్ష్మి తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఏపీ జెఏసీ కురుపాం తాలూకా యూనిట్ అధ్యక్షుడిగా ఎస్ఎస్ ప్రకాష్ .

**కురుపాం,పెన్ పవర్,ఏప్రిల్9:** ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల మరియు కార్మికులు సమస్యలపై ఐక్యంగా పోరాడినప్పుడే సమస్యల పరిష్కారం అవుతాయని ఏపీ జేఏసీ కురుపాం తాలూకా యూనిట్ అధ్యక్షుడు ఎస్ ఎస్ ప్రకాష్ అన్నారు. గురువారం కురుపాం పెన్షనర్లు భవనంలో ఏపీ జేఏసీ కురుపాం తాలూకా యూనిట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉద్యోగుల ఉపాధ్యాయుల పెన్షనర్ల మరియు కార్మికుల సంఘాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. సంఘం అధ్యక్షుడిగా ఎస్ఎస్.ప్రకాష్, అసోసియేట్ అధ్యక్షుడు టి.పాండురంగ, సెక్రటరీ ఎ.వెంకటనాయుడు, ఉపాధ్యక్షులుగా జి.నారాయణరావు, ఎ.జగదీశ్వరరావు, ఎన్. శ్రీరాములు, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగేంద్ర సాయి, జాయింట్ సెక్రటరీలగా జె.తిరుపతిరావు, ఎ.మురళీకృష్ణ, బిఎల్. ప్రకాష్, ట్రెజరర్ బి.సంతోష్ గుణకరరావు, మహిళా విభాగం వైస్ ప్రెసిడెంట్ కె.రస్మిత, మహిళా విభాగం సెక్రెటరీ జె సరోజ, మహిళ విభాగం మెంబర్ కె. అరుణ జ్యోతి, అలేఖ్య కుమార్. తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



## జనాభా గణన విధుల్లో నిర్లక్ష్యం పనికిరాదు






జె.సి. సి.యశ్వంత్ కుమార్ రెడ్డి

**కురుపాం/గుమ్మలక్ష్మీపురం,పెన్ పవర్,ఏప్రిల్ 09 :** జనాభా గణన-2027 ప్రక్రియలో భాగంగా మొదటి విడతగా చేపట్టనున్న గృహాల జాబితా నమోదు మరియు గృహ గణన కార్యక్రమంలో

నిర్లక్ష్యం పనికిరాదని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఎన్యూమరేటర్లకు స్పష్టం చేశారు. ఎన్యూమరేటర్లు మరియు సూపర్వైజర్లకు అవగాహన కల్పించే శిక్షణా కార్యక్రమాలు గురువారం కురుపాం మరియు గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి హాజరై, శిక్షణను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జె.సి మాట్లాడుతూ.. దేశ ప్రగతికి, భవిష్యత్తు ప్రణాళికల రూపకల్పనకు జనాభా గణన అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఎన్యూమరేటర్లు క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటిని సందర్శించి, ఎటువంటి తప్పులు లేకుండా ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించాలని ఆదేశించారు. గృహాల జాబితా నమోదులో అనుసరించాల్సిన సాంకేతిక పద్ధతులు మరియు మొబైల్ యాప్ వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. సూపర్వైజర్లు తమ పరిధిలోని ఎన్యూమరేటర్ల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, సమాచార సేకరణలో నాణ్యతను తనిఖీ చేయాలని ఆదేశించారు. మండల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి నిర్ణీత గడువులోగా మొదటి విడత గణనను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సంబంధిత మండల తహశీల్దార్లు, ఎంపీడీవోలు, గణాంక శాఖ అధికారులు, ఎన్యూమరేటర్లు మరియు సూపర్వైజర్లు పాల్గొన్నారు.




## శ్రీ శ్రీ శ్రీ మోదకొండమ్మ జాతర గంట మోగింది.

- మోదకొండమ్మ జాతరకు పందిరి రాట తో జాతర పనులు ప్రారంభం





**హుకుంపేట, పెన్ పవర్, ఏప్రిల్ 9:** అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం హుకుంపేట గ్రామంలో మే 3, 4, 5 తేదీల్లో జరగనున్న శ్రీ శ్రీ శ్రీ మొదకొండమ్మ జాతర ఉత్సవాల సందర్భంగా పండుగ పందిరి రాట వేశారు ఈ కార్యక్రమాన్ని ఉత్సవ కమిటీ, మరియు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా. నిర్వహించారు. ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కూడా జాతరను ఘనంగా నిర్వహిస్తామని. నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హుకుంపేట సీఐ సన్యాసి నాయుడు హాజరయ్యారు. మాజీ సర్పంచ్ సమిడ వెంకట పూర్ణిమ, ఎంపీటీసీ కొమ్మ రమ, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొర్ర నాగబాబు, ఉపాధ్యక్షుడు శోభ సంతోష్, మాజీ వైస్ సర్పంచ్ గోవింద్, మాజీ జడ్పీటీసీ కాసులమ్మ, వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు అనిల్ పాల్గొన్నారు. అలాగే ఉత్సవ కమిటీ సభ్యులు నైని సత్తిబాబు, సిరగం సూర్యకాంతం, వోలుగు వాసుదేవ్, బద్నాయిని, శివబాలు, పాడి వెంకటేష్, లక్ష్మణ్, నూకరాజు, పేసా కమిటీ సభ్యులు జన్ని వెంకట్, వంతల ఈశ్వర్‌రావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. ద

## అరకు ఐటిఐలో ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిషిప్ మేళా



**చింతపల్లి,పెన్ పవర్, ఏప్రిల్ 13:** , ఈ నెల 13, సోమవారం అరకు ఐటిఐలో ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిషిప్ మేళా నిర్వహించనున్నట్లు స్థానిక ప్రభుత్వ ఐటిఐ చింతపల్లి ప్రిన్సిపాల్ వై. రామ్మోహన్ రావు తెలిపారు. 2023 నుండి ఇప్పటివరకు ఐటిఐలో అన్ని ట్రేడ్స్‌లో ఉత్తీర్ణత సాధించినవారు, అలాగే 2026లో ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు ఈ మేళాకు అర్హులని పేర్కొన్నారు. వివిధ ప్రముఖ కంపెనీల ప్రతినిధులు ఈ సందర్భంగా ఇంటర్వ్యూలు నిర్వహించి, ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేస్తారు. ప్రిన్సిపాల్ విద్యార్థులను ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఒరిజినల్ ధ్రువపత్రాలు మరియు జెరాక్స్ కాపీలను తీసుకుని రావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8019794451, 9492014850 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు ...

* జాయింట్ కలెక్టర్ సి. యస్వంత్ కుమార్ రెడ్డి





**కురుపాం, పెన్ పవర్,ఏప్రిల్ 09:** ఆశ్రమ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని, విధి నిర్వహణలో ఏమాత్రం అలసత్వం వహించినా సహించేది లేదని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ సి. యస్వంత్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. గురువారం ఆయన కురుపాం మండలం, పొడి గ్రామంలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.?తనిఖీలో భాగంగా విద్యార్థుల విద్యా ప్రమాణాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంపై జాయింట్ కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా విద్యార్థుల ఎగ్జామ్ వర్క్ బుక్స్‌ను ఉపాధ్యాయులు సరిగా మూల్యాంకనం చేయకపోవడాన్ని ఆయన తప్పుపట్టారు. విద్యార్థులు చేసిన తప్పులను గుర్తించి, వారికి వివరించడంలో ఉపాధ్యాయులు విఫలమయ్యారని మండిపడ్డారు. ఈ క్రమంలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన హెడ్ మాస్టర్లు, ఉపాధ్యాయులకు ప్రాజెక్ట్ ఆఫీసర్ ద్వారా చార్జ్ మెమోలు జారీ చేశారు.?పాఠశాల ప్రాంగణంలో పరిశుభ్రత లోపించడం, స్టోర్ రూమ్‌ల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటంపై జేసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే పాఠశాల వాతావరణాన్ని మెరుగుపరచాలని, వర్క్ బుక్స్‌ను క్రమం తప్పకుండా పరిశీలించి విద్యార్థులకు సరైన మార్గనిర్దేశం చేయాలని అధికారులను ఆదేశించారు.?ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ అధికారులు, మండల రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జనన గణన సేకరణ లో సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి......

* తాసిల్దార్ ఓ.చందన రేఖ....



**నాతవరం,పెన్ పవర్ (ఏప్రిల్,09)** జనన గణన సేకరణలో సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల తాసిల్దార్ ఓ. చందన రాక అన్నారు. గురువారం మండల కేంద్రమైన నాతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనాభా గణన కార్యక్రమానికి సంబంధించి శిక్షణా తరగతులు ప్రారంభించారు.సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో తాసిల్దార్ ఓ. చందన రేఖ మాట్లాడుతూ 2026-2027 జనన గణన మూడు విడతలగా ఒక్కో విడతలో 50 మందికి మూడు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని,డేటా ఇంటింటికి వెళ్లి కుటుంబ వివరాలను సేకరించాలని, నమోదు సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. జనాభా గణన సేకరణ ప్రక్రియను పగడబందిగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ నాగరాజు ఏ ఎస్. ఓ, ఉలబాల రాజబాబు ఎన్యుమరేటర్లు ఎం,నాని బాబు, రమణ,రెవిన్యూ సిబ్బంది సచివాలయ సిబ్బంది ఉపాదామి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వేసవి సెలవుల్లో విద్యార్థులు పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి



**నాతవరం, పెన్ పవర్ (ఏప్రిల్ 09):** వేసవి సెలవుల్లో తల్లిదండ్రులు విద్యార్థులు పట్ల పలు జాగ్రత్తలు తీసుకోవాలని నాతవరం ఎస్సై వై. తారకేశ్వరరావు తెలిపారు.గురవారం మండలం లో గల సరుగుడు పంచాయతీలోని ఏజెన్సీ గ్రామమైన దద్దుగుల పాఠశాలలో కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా చిన్నారులకు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై తారకేశ్వరం మాట్లాడుతూ చెరువులు, కాలువలు దగ్గరకు,నీటి ప్రవాహాల దగ్గరకు వెళ్లకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ లో భాగంగా విద్యార్థులకు వేసవి సెలవుల స్టడీ మెటీరియల్, బకెట్లు తదితర సామాగ్రిని విద్యార్థులకు అందజేశారు. అంతేకాకుండా కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా పోలీసులు ఆ పాఠశాలను దత్తత తీసుకొని పాఠశాల పరిసరాలు శుభ్రపరిచి,గోడలు, పాఠశాల భవనాలు, వంటశాలలకు ఆకర్షణీయమైన విద్యా పెయింటింగ్స్ వేయించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ముల్లుమెట్ట రోడ్డుపై విషాదకర రోడ్డు ప్రమాదం: ఒకరు మృతి,





### మరొకరి పరిస్థితి విషమం

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఏప్రిల్ 9:**అల్లూరి జిల్లా జీకే వీధి మండలం ముల్లుమెట్ట--రింతాడ గ్రామాల మధ్య టేకులవీధి సమీపంలో గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. వారిలో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందగా, మరొకరు ప్రాణాపాయ స్థితిలో విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.చింతపల్లి మండలం అన్నవరం పంచాయతీ కూర్మన్నపాకలు గ్రామ నివాసులు కొర్ర కోటిబాబు (26) మరియు పాంగి అప్పారావు (28) వ్యక్తిగత పనిమీద బైక్‌పై గూడెం కొత్తవీధి వైపు వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న అంబులెన్స్‌ను తప్పించడానికి ప్రయత్నిస్తుండగా అదుపు కోల్పోయి రోడ్డు పక్కన నిలిపి ఉన్న బొలెరోను ఢీ కొట్టినట్టు సమాచారం.ఇద్దరూ రోడ్డు పక్కనున్న పొదల్లోకి ఎగిరి పడి తీవ్ర గాయాలు చెందారు. గ్రామస్థులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి, క్షతగాత్రులను చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు డాక్టర్ చందన అత్యవసర చికిత్స అందించినప్పటికీ, పాంగి అప్పారావు మృతి చెందాడు. కోటిబాబు పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖపట్నం కింగ్ జార్జ్ ఆసుపత్రికి తరలించారు.స్థానికుల సమాచారం ప్రకారం, ప్రమాద సమయంలో యువకులు మద్యం మత్తులో ఉన్నారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ముల్లుమెట్ట రోడ్ సన్నగా ఉండటం, ప్రమాదకర మలుపులు, వేగం మరియు నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగా ఇలాంటి ఘటనలు తరచుగా జరుగుతున్నాయి. స్థానికులు రహదారి భద్రత కోసం హెచ్చరిక బోర్డులు,ఏర్పాటు చేసి పర్యవేక్షణ పెంచాలని కోరుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## తండ్రిని దేవుడిలా పూజించడం అభినందనీయం





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఏప్రిల్ 09.** తండ్రిని విగ్రహ రూపంలో ఏర్పాటు చేసి దేవుడిలా పూజించడం అభినందనీయమని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. గురువారం తాడేపల్లిగూడెం మండలం కొమ్ముగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన ఆలపాటి గంగరాజు విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ తండ్రి గంగరాజును విగ్రహ రూపంలో సజీవంగా నిలిపి ఉంచారన్నారు. పట్టణ ప్రాంతాల్లో తల్లిదండ్రులు చనిపోతే మరచిపోయే పరిస్థితి ఉందన్నారు. అయితే, గ్రామీణ ప్రాంతాల్లో మంచి సంప్రదాయం కొనసాగుతుందన్నారు. తల్లిదండ్రులను దైవంలా చూడాలన్నారు. తండ్రి జ్ఞాపకార్థం విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గతంతో పోల్చుకుంటే తల్లిదండ్రులను మంచిగా చూసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. వృద్ధాప్యం పైబడిన తల్లిదండ్రులే మనకు మార్గదర్శకులని పేర్కొన్నారు. మన కాళ్లపై మనం నిలబడగలగడానికి వారు ఇచ్చిన శక్తి సామర్థ్యాలేనని గుర్తు చేశారు. జడ్పిటిసి ఆంజనేయులు, మాజీ ఎంపీపీ పరిమి రవికుమార్, మాజీ సర్పంచ్ సూర్పని వెంకటరావు, గంగరాజు కుమారులు ఆలపాటి శ్రీనివాస్, ఆలపాటి నాగేశ్వరరావు, ఆలపాటి అమ్మిరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 14న దళితుల ఐక్యతా ర్యాలీ





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 9:** ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఐక్యవేదిక, అంబేద్కర్ సేవా కేంద్రం సంయుక్త నిర్వహణలో రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 14వ తేదీన దళితుల ఐక్యతా ర్యాలీగా నిర్వహించనున్నారు. ఈ మేరకు స్వర్ణాంధ్ర సేవసంస్థ నిర్వాహకులు, అంబేద్కర్ సేవా కేంద్రం వ్యవస్థాపక చైర్మన్ గుబ్బల రాంబాబు, కన్వీనర్, మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు ఆధ్వర్యంలో స్థానిక లాలాచెరువు స్వర్ణాంధ్ర సేవా సంస్థ ప్రాంగణంలో ర్యాలీ నిర్వహణకు సంబంధించిన సన్నాహక సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోడపత్రిక, ఫ్లెక్సీలను, కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆస్క్ చైర్మన్ గుబ్బల రాంబాబు మాట్లాడుతూ , జయంతి ఉత్సవ ర్యాలీ ఈ ఏడాది స్థానిక క్వారీ మార్కెట్ జంక్షన్ అంబేద్కర్ విగ్రహం నుంచి గోకవరం బస్టాండ్ వద్దనున్న అంబేద్కర్ విగ్రహం వరకు జరుగుతుందన్నారు. ఈ ర్యాలీకి ఐక్యత ర్యాలీ అని పేరు పెట్టమన్నారు. ఈ ఐక్యతా ర్యాలీలో రాజమండ్రి సిటీ, రూరల్ పరిసర ప్రాంతాలతో ఉభయ గోదావరి జిల్లాల నుంచి అంబేద్కర్ వాదులు తరలిరావాలని పిలుపునిచ్చారు. దేశంలో, ముఖ్యంగా రాష్ట్రంలో దళితులు, దళిత క్రైస్తవులపై దాడులు,వివక్ష అన్నిచోట్ల ఇటీవల కాలంలో బాగా పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేసారు. అంబేద్కర్ రాజ్యాంగం హక్కులపై కూడా దాడులు జరగడం బాధాకరమన్నారు. ఏప్రిల్ 14వ తేదీ అంబేద్కర్ జయంతి సందర్భంగా మద్య నిషేధ దినోత్సవంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. అజ్జరపు వాసు మాట్లాడుతూ 14వ తేదీ దళిత పేటల్లో అంబేద్కర్ జయంతలు నిర్వర్తించుకుని 3 గంటల ర్యాలీకి హాజరు కావాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో ఆరే రాము, మామిడి శ్రీనువాసరావు, పోలుపల్లి సురేష్, గారా త్రినాధ్, చెక్కా నవీన్, తోడేటి రాజా, కొమారపు సురేష్, సందీప్, జయరాజ్, ఉల్లం.తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ తో పాడి గేదె మృతి



### అధికారులు అదుకోవాలంటు పాడి రైతు ఆవేదన

**సీతానగరం, పెన్ పవర్, ఏప్రిల్ 9:**విద్యుత్ షాక్ తో పాడి గేదె మృతి చెందిన సంఘటన సీతానగరం మండలంలోని రఘుదేవపురం గ్రామపం
చాయతీ పరిధిలో గల గ్రామ శివారులో బొల్లి వేణుగోపాల్ పొలం వద్ద చోటు చేసుకుంది. పంట పొలాల్లో మేతకు వెళ్లిన గేదె ప్రమాదవశాస్తూ మృతి చెందింది. పుల్లయ్య గేదె సుమారు లక్ష రూపాయలు ఉంటుందని అన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని పాడిరైతు ఆవేదన చెందుతున్నారు.

## పోషణ పక్వాడ పోషణ పక్షోత్సవ కార్యక్రమం




**సీతానగరం, పెన్ పవర్, ఏప్రిల్ 9:**సీతానగరం మండలంలోని గురువారం నాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద 8వ షోషణ పక్వాడ కార్యక్రమం అంగన్వాడీ టీచర్లు ఆశా వర్కర్లు సమక్షంలో అంగన్వాడి సూపర్వైజర్ అచ్చయమ్మ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీలు పోషకాహారం తీసుకుంటే పండంటి బిడ్డను జన్మనిలస్తారు. ఆలాగే ప్రతిరోజు బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. పిల్లల తల్లిలకు ఇచ్చిన గ్రోత్ కార్డుల్లో బరువు సూచించిన విధంగా ఉండాలని ప్రతినెల పిల్లలను అంగన్వాడి కేంద్రాలకు తీసుకువచ్చి పిల్లల బరువులు ఎత్తు తనిఖీ చేయించి వారి ఎత్తు బరువు పెరిగేలా చూడాలని తెలిపారు. అలాగే పోషణ పక్షంలో భాగంగా చిరుధాన్యాలపై తల్లులకు కిశోర బాలికలకు అవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# గుమ్మిలేరు వరహాల కాలువ గట్టు రోడ్డుకు మహర్దశ

- రూ.30 లక్షలతో మెటల్ రోడ్డు నిర్మాణం
- రైతుల్లో పట్టరాని ఆనందం

**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 09;**కొత్తపేట నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దశాబ్దాల కాలంగా అభివృద్ధికి నోచుకోని రోడ్లకు మోక్షం కలుగుతుంది. అలాంటిదే ఆలమూరు మండలం గుమ్మిలేరు వరహాల కాలవ గట్టు రోడ్డు.ఈ పుంత రోడ్డును జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.30 లక్షలతో మెటల్ రోడ్డుగా నిర్మించారు.గుమ్మిలేరు గ్రామం చాలావరకు అభివృద్ధి చెందింది. అయితే అక్కడ రైతులంతా ఈ రోడ్డుకు నిధులు ఇవ్వాలని పిఎసిఎస్ అధ్యక్షులు ఈదల వీర్రాజు ( అముజూరు శ్రీను) ఆద్వర్యంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి ఈ నిధులను మంజూరు చేయించారు.

ఇక ఈ రోడ్డు వల్ల ప్రయోజనం గురించి తెలుసుకుంటే ఇది గుమ్మిలేరు గ్రామానికి 'గ్రీన్ ఫీల్డ్' రోడ్డు వంటిది. ఓ బైపాస్ రోడ్డు గా చెప్పుకోవచ్చు. వరహాల కాలం నుంచి పంట పొలాల మధ్యలో మండపేట సమీపంలోని జైన్ దేవాలయానికి చేరుకుంటుంది. ఈ రోడ్డు పొడవు సుమారు కిలోమీటర్నర(1450 మీటర్లు),వెడల్పు పన్నెండు అడుగులు. మట్టి రోడ్డుగా ఉండే ఈ రోడ్డుకు వివిఎస్ఎస్ చౌదరి ఎమ్మెల్యేగా ఉండగా పనికి ఆహారం పథకం ద్వారా గ్రావెల్ రోడ్డు నిర్మించారు. కాని అది తక్కువ సమయంలోనే పాడైపోయింది. అద్వానంగా ఉన్న ఈ రోడ్డుకు ఇప్పుడు మహర్దశ పట్టిందని చెప్పవచ్చు. సోలింగ్ గ్రావెల్ రాయితో ముందు రోడ్డును పటిష్ఠ పరిచారు. ఆ తర్వాత నాలుగు అడుగుల మందంతో 30,40 ఎంఎం మెటల్ రోడ్డు నిర్మించి హైడ్రాలిక్ రోలర్ తో పటిష్ఠ పరిచారు. అనంతరం మూడు అంగుళాల పూస గ్రావెల్ వేసి మరోసారి రోలింగ్ చేసారు. అలాగే రైతుల పర్యవేక్షణలో తగినంత వాటరింగ్ కూడా చేపట్టారు. ఈ రోడ్డు వల్ల భవిష్యత్తులో జరిగే పెద్ద ప్రయోజనం ఏంటంటే అక్కడ 29 ఎకరాల భూమిని గత ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలకు సేకరించారు.మండలంలో పలు గ్రామాల వారికి అక్కడ ఇళ్ల స్థలాలు కేటాయించి పట్టాలు కూడా అందజేశారు. ఈ రోడ్డు నిర్మాణంతో కొత్తగా ఏర్పడే ఆ కాలనీకి చాలా అంటే చాలా ప్రయోజకరంగా ఉంటుంది. మొత్తానికి ఈ రోడ్డు నిర్మాణంతో ఆ ప్రాంతంలోనే ఉన్న సుమారు 300 ఎకరాల ఆయకట్టు రైతులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఆదిత్య యూనివర్సిటీ లో విజయవంతంగా ముగిసిన ముగిచిన క్రికెట్ టోర్నమెంట్







**గండేపల్లి, పెన్ పవర్, ఏప్రిల్ ,9**:గండేపల్లి మండలం సూరంపాలెం: ఆదిత్య యూనివర్సిటీ లో గత నెల 2 వ తారీకు నుంచి ఆదిత్య క్రికెట్ టోర్నమెంట్ (ఎ సి టి) పేరిట నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ఈరోజు విజయవంతంగా ముగియటం జరిగింది అని డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ తెలిపారు. యూనివర్సిటీ లో గల వివిధ బ్రాంచ్ లకు చెందిన విద్యార్థులు మొత్తం 52 టీమ్స్ గా ఏర్పడి ఈ టోర్నమెంట్ లో పాల్గొనడం జరిగింది, ఈ టోర్నమెంట్ ఛాంపియన్స్ గా సివిల్ విభాగం టీం నిలిచి నగదు బహుమతి 25,000/- మరియు ట్రోఫీ గెలుచుకుంది ,రన్నరప్ గా ఎం.సి.ఏ విభాగం టీం నిలిచి నగదు బహుమతి 15000/- మరియు ట్రోఫీ అందుకున్నారు. అలాగే మూడవ స్థానం డేటా సైన్స్ విభాగం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ రూ 10,000 మరియు ట్రోఫీ కైవసం చేసుకున్నారు, విజేతలకు డిప్యూటీ ప్రో ఛాన్సిలర్ డా ఎమ్ శ్రీనివాస్ రెడ్డి అలాగే ఇతర అధికారులు చేతుల మీదుగా బహుమతులు అందించడం జరిగింది,ఈ కార్యక్రమంలో ప్రో వైస్ ఛాన్సిలర్ డా ఎ రమేష్,ఆదిత్య యూనివర్సిటీ రిజిస్టర్ డా. జి సురేష్,డీన్ స్టూడెంట్ ఏఫైర్స్ డా. డి కిషోర్ , ఆదిత్య యూనివర్సిటీ వ్యాయామ విభాగాధిపతి డా. ఎన్ రవి, కన్వీనర్ కె శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ బియ్యం తరలిస్తున్న వాహనం పట్టివేత



**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రిల్ 9:**ఆత్రేయపురం గ్రామంలోని రాంబా సెంటర్ వద్ద అక్రమంగా పీడీఎస్ రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారంతో, ఆత్రేయపురం ఎస్ఐ ఎస్ రాము తన సిబ్బంది తో అక్కడికి చేరుకొని రైడ్ నిర్వహించారు. ఒక టాటా అశోక్ లేలాండ్ వాహనం, సుమారు 1700 కేజీల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఒక అనుమానిత వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయంపై ఆత్రేయపురం ఎస్ఐ ఎస్ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## కిర్లంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జన గణనపై శిక్షణా తరగతులు



**కిర్లంపూడి, పెన్ పవర్, ఏప్రియల్, 09**:కిర్లంపూడి మండలంలో జనగణన-2027 లో భాగంగా మండల కేంద్రమైన కిర్లంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జనగణనపై శిక్షణా తరగతులు నిర్వహించారు.మండల తహసీల్దార్,చార్జ్ ఆఫీసర్ కె సాయికిరణ్,అడిషనల్ చార్జ్ ఆఫీసర్, ఎంపీడీఓ బావిశెట్టి హరికృష్ణ ఆధ్వర్యంలో ఈ శిక్షణా తరగతులు ప్రారంభించారు.వారి ఆధ్వర్యంలో ఈ శిక్షణా కార్యక్రమంలో జిల్లా యంత్రాంగం నుండి శిక్షణ పొందిన ఫీల్డ్ ట్రైనర్లు,ఎన్యుమేటర్లకు, సూపర్వైజర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణా కార్యక్రమానికి పెద్దాపురం ఆర్డీవో శ్రీధర్ సందర్శించి శిక్షణ పొందే వారికి పలు సలహాలు సూచనలు అందజేశారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

-వ్యవసాయ శాఖ అధికారిణి నాగం సుధామాధురి.





**కిర్లంపూడి,పెన్ పవర్, 09**:ప్రస్తుత సీజనులో మండలంలో ముమ్మరంగా వరి కోతలు కోస్తున్నందున ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి,నాగం.సుధామాధురి పిలుపునిచ్చారు. కిర్లంపూడి మండలంలో రైతు సేవా కేంద్రాల్లో 14 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలన్నారు.దళారులను నమ్మి ధాన్యాన్ని తక్కువ రేటుకు అమ్ముకోవద్దని సూచించారు. ఆరుదల కామన్ రకం ధాన్యానికి 1777 రూపాయలు, గ్రేడ్ ఎ రకం దాన్యానికి 1792 రూపాయలు ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించడం జరిగిందన్నారు.

## ఏలేశ్వరం ఎంపీడీవో కార్యాలయంలో 2027 సెన్సస్ పై శిక్షణా తరగతులు.



**ఏలేశ్వరం, పెన్ పవర్, ఏప్రిల్ 9:** మండలంలో 2027 సెన్సెస్ లో భాగంగా ఎంపీడీవో కార్యాలయం నందు జనగణన పై శిక్షణా తరగతులు గురువారం నిర్వహించారు. మండల తహశీల్దార్ చార్జ్ ఆఫీసర్ కె కుశరాజు, అడిషనల్ చార్జ్ ఆఫీసర్ ఎంపీడీవో ఎం వి రామరాజ వర్మ, ఆధ్వర్యంలో ఈ శిక్షణా తరగతులు ప్రారంభించారు. శిక్షణ చేపట్టే వారిని నాలుగు విభాగాలుగా కేటాయించి ఒక్కొక్క విభాగానికి మూడు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నామని తెలిపారు. ఉదయం 9:30 నుండి సాయంత్రం 5:30 వరకు ఈ శిక్షణ కొనసాగుతుందని అన్నారు.మొదటి విభాగంలో 9/4/26 నుండి 11/4/26 మూడు రోజులు జరుగుతున్నాయని, ఒక్కొక్క విభాగానికి మూడు రోజులు చొప్పున చేపట్టడం జరుగుతుందని దీనిలో ఇళ్ల లెక్కింపు, గృహ గణన పై ప్రాధాన్యతఉంటుందని తెలిపారు.ఈ ప్రత్యేక శిక్షణతరగతుల్లో ట్రైనర్లుగా ప్రసాద్ , అప్పారావు వ్యవహరిస్తారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ నాగపార్వతి పాల్గొన్నారు.

## వాడపల్లిలో అభివృద్ధి పనులు వేగవంతం

- ఎమ్మెల్యే బండారు సత్యానందరావు






**ఆత్రేయపురం, పెన్ పవర్ ఏప్రిల్ 9:**కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తుల సౌకర్యాల కోసం చేపట్టిన అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా రూ.2.70 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, కొన్ని పనులను ప్రారంభించారు. జల జీవన్ మిషన్ పథకం కింద రూ.94.50 లక్షలతో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా రూ.1.75 కోట్లతో ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాన్ని ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్, ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ధర్మకర్త మండల సభ్యులు ,డిప్యూటీ కమిషనర్ సూర్యచక్రధర్ రావు మండల టిడిపి అధ్యక్షులు కూసం పూడి రామకృష్ణంరాజు , మండల కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు

## వాడపల్లిలో ప్రజా దర్బార్

## ప్రజల నుండి 73 వినతి పత్రాలు అందుకున్న ఎమ్మెల్యే బండారు





**ఆత్రేయపురం, పెన్ పవర్ ఏప్రిల్ 9:**ప్రజల సమస్యలను నేరుగా పరిష్కరించేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. గురువారం వాడపల్లి సచివాలయం వద్ద నిర్వహించిన ప్రజా దర్బార్‌కు గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

ఈ సందర్భంగా మొత్తం 73 మంది ప్రజలు తమ వినతులను ఎమ్మెల్యేకు అందజేశారు. ముఖ్యంగా ఇంటి స్థలాలు, పింఛన్లు తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కొన్ని సమస్యలను తక్షణమే పరిష్కరించారు.

ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి పూడి రామకృష్ణంరాజు వాడపల్లి దేవస్థాన చైర్మన్ ముదునూరి వెంకటరాజు, మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆ ఒక్క నిర్ణయంతో గుజరాత్ జట్టులో గొడవ..
# శుభ్‌మన్ గిల్‌ను తిట్టిన ఆశిష్ నెహ్రా



**హైదరాబాద్ పెన్ పవర్:** ఢిల్లీలోని అరుణ్ జైట్లీ మైదానంలో జరిగిన ఉత్కంఠభరిత పోరులో గుజరాత్ టైటాన్స్ జట్టు ఒక్క పరుగుతో ఢిల్లీ క్యాపిటల్స్ టీమ్ పై విజయం సాధించింది. చివరి బంతి వరకు ఉత్కంఠగా కొనసాగిన ఈ మ్యాచ్ అభిమానులను బాగా అలరించింది. కాగా ఈ మ్యాచ్‌లో గుజరాత్ జట్టు ప్రధాన కోచ్ ఆశిష్ నెహ్రా తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ చేసిన ఒక తప్పిదంపై ఆయన తీవ్రంగా మండిపడ్డిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ గా మారింది. రెండో ఇన్నింగ్స్ 16వ ఓవర్‌లో జరిగిన ఓవర్ త్రో ఘటన మ్యాచ్‌ను మలుపుతిప్పేలా కనిపించింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వికెట్‌కీపర్ జోష్ బట్లర్ వైపుకి నేరుగా బంతిని విసిరగా, అది స్టంప్స్‌ను తాకి బౌండరీకి వెళ్లిపోయింది. దీంతో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు అదనంగా నాలుగు పరుగులు లభించాయి. ఆ సమయంలో క్రీజ్‌లో కేఎల్ రాహుల్, ట్రిస్టన్ స్టబ్స్ ఉన్నారు. ఈ ఘటనపై కోచ్ నెహ్రా డగౌట్ లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. అయితే బ్యాటింగ్‌లో గిల్ అద్భుతంగా ఆడాడు. 45 బంతుల్లో 70 పరుగులు చేసి జట్టు భారీ స్కోరు చేయడంలో కీలక పాత్ర పోషించాడు. అతని ఇన్నింగ్స్‌లో 5 సిక్సర్లు, 4 ఫోర్లు ఉన్నాయి. అలాగే జోస్ బట్లర్ హాఫ్ సెంచరీతో మెరిశాడు. వాషింగ్టన్ సుందర్ కూడా తన తొలి అర్ధశతకాన్ని నమోదు చేశాడు.

కాగా రెండో ఇన్నింగ్స్‌లో గుజరాత్ టైటాన్స్ విజయంలో మిస్టర్ స్పిన్నర్ రషీద్ ఖాన్ కీలక పాత్ర పోషించాడు. నాలుగు ఓవర్లలో కేవలం 17 పరుగులు మాత్రమే ఇచ్చి కీలక బ్యాటర్లు నితీశ్ రాణా, సమీర్ రిజ్వి, అక్షర్ పటేల్ వికెట్లు తీసి మ్యాచ్‌ను గుజరాత్ వైపు మళ్లించాడు. ఈ మ్యాచ్‌లో లాస్ట్ బాల్ వరకు ఉత్కంఠభరితంగా సాగిన పోరులో గుజరాత్ జట్టు చివరికి ఒక్క పరుగుతో విజయం సాధించింది.

# సినిమాల్లోకి హిట్ మ్యాన్.. రోహిత్ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీతో సరికొత్త చర్చ

**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా స్టార్ క్రికెటర్, మాజీ కెప్టెన్ హిట్ మ్యాన్ రోహిత్ శర్మ సోషల్ మీడియాలో చేసిన ఒక పోస్ట్ ఇప్పుడు తెగ వైరల్ అవుతోంది. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ , ముంబై ఇండియన్స్ లోగోలతో ఉన్న ఒక స్క్రిప్ట్ ఫోటోను షేర్ చేస్తూ అభిమానులకు పెద్ద సర్‌ప్రైజ్ ఇచ్చాడు.




**ఏమిటా 'డ్రాఫ్ట్ #45':**
రోహిత్ శర్మ షేర్ చేసిన ఫోటోలో 'ఐత్ఖుట్ ఎ45' అని రాసి ఉన్న ఒక స్క్రిప్ట్ కనపడుతుంది. దాంతో ఈరో తేదీ (ఏప్రిల్ 9, 2026) ఉండటంతో పాటు టైటిల్ చివరలో 'జష్త్రుఎజూఅశీఅ' అనే పదం క్లియర్ గా కనిపిస్తోంది. ఇది హిట్ మ్యాన్ జీవిత చరిత్ర (దీఅశీజూఅఎ) కావొచ్చని లేదా ముంబై ఇండియన్స్ జట్టు సాధించిన విజయాలపై తీస్తున్న డాక్యుమెంటరీ అయ్యే ఛాన్స్ ఉందని సోషల్ మీడియాలో ఫ్యాన్స్ తెగ చర్చించుకుంటున్నారు. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

**ఐపీఎల్ లో రోహిత్ దూకుడు:**
ఒకవైపు సినిమాల వార్తలు వినిపిస్తున్నప్పటికీ, రోహిత్ శర్మ మాత్రం ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ తరపున బిజీగా ఉన్నాడు. ఈ సీజన్ మొదటి మ్యాచ్‌లో కోల్‌కతాపై రోహిత్ 78 పరుగులు చేసి అదరగొట్టాడు. ఆ తర్వాత ఢిల్లీపై 35 పరుగులు చేసినప్పటికీ, రాజస్థాన్‌తో జరిగిన వర్షం ప్రభావిత మ్యాచ్‌లో కేవలం 5 పరుగులకే అవుట్ అయ్యాడు. ఇప్పటి వరకు ఆడిన మూడు మ్యాచ్‌ల్లో రోహిత్ 118 పరుగులు చేసి, అత్యధిక పరుగులు చేసిన టాప్-5 బ్యాటర్ల జాబితాలో కొనసాగుతున్నాడు.

**ముంబై ఇండియన్స్ ప్రస్తుత పరిస్థితి:**
ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ముంబై ఇండియన్స్ జట్టు ప్రస్తుతం పాయింట్ల పట్టికలో 8వ స్థానంలో కొనసాగుతుంది. మొదటి మ్యాచ్ గెలిచినప్పటికీ, ఆ తర్వాత వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. టీమ్ మళ్ళీ విజయాల బాట పట్టాలంటే రోహిత్ శర్మ తన పాత ఫామ్‌ను అందుకోవాలని క్రికెట్ అభిమానులు కోరుకుంటున్నారు. ఇక మైదానంలో బౌలర్లను భయపెట్టే రోహిత్, ఇప్పుడు నెట్‌ఫ్లిక్స్ ద్వారా వెండితెరపై ఎలాంటి మ్యాజిక్ చేస్తాడో అనేది వేచి చూడాలి. ఈ 'ఛాంపియన్' ప్రాజెక్ట్ గురించి మరిన్ని వివరాలు త్వరలోనే బయటకు వచ్చే అవకాశం ఉంది.

# ఉత్కంఠ పోరులో లక్నో ఘన విజయం.. హోంగ్రౌండ్‌లో మళ్లీ ఓడిన కేకేఆర్



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్ లో భాగంగా ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్ తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో 3 వికెట్ల తేడాతో లక్నో సూపర్ జెయింట్స్ ఘన విజయం సాధించింది. కాగా టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన కేకేఆర్ జట్టుకి ఆశించిన ఆరంభం లభించలేదు.. 15 పరుగుల వద్ద ఓపెనర్ ఫిన్ అలెన్ (9) ఔట్ అయ్యాడు. అనంతరం రహానే-- రఘువంశీ నెలకొల్పిన 84 పరుగుల అద్భుతమైన భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. 99 పరుగుల వద్ద రహానే (41) డగౌట్ కి వెళ్లగా, ఆ తర్వాత రఘువంశీ (45), రింకు సింగ్ (4) వరుసగా పెవిలియన్ కి క్యూ కట్టారు. కానీ చివర్లో రోవ్‌మన్ పావెల్ (39), కామెరూన్ గ్రీన్ మరో 50 పరుగుల భాగస్వామ్యాన్ని జోడించడంతో 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 181 182 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన లక్నో సూపర్ జెయింట్స్ జట్టు ఆటగాడు ఆయూష్ బదోనీ, ముకుల్ చౌదరీ అద్భుతమైన హాఫ్ సెంచరీలతో చెలరేగారు. అంతకుముందు, లక్నో ఓపెనర్లు ఐడెన్ మార్క్రమ్-- మిచెల్ మార్ష్ జోడి మంచి ఆరంభాన్ని అందించారు. వీరిద్దరి మధ్య నెలకొన్న 41 పరుగుల పార్ట్నర్ షిప్ ని వైభవ్ ఆరోరా బ్రేక్ చేశాడు. మార్ష్ (15)కి సంధించిన ఓ సూపర్బ్ బంతిని ఆడే క్రమంలో కీపర్ రఘువంశీకి క్యాచ్ ఇచ్చి పెవిలియన్ కి వెళ్లిపోయాడు. ఆ తర్వాత కాసేపటికే మార్క్రమ్ (22) బ్యాటింగ్ లో స్పీడ్ పెంచే క్రమంలో వైభవ్ ఆరోరా బౌలింగ్ లో భారీ షాట్ ఆడగా ఆది నేరుగా బౌండరీ లైన్ వద్ద ఉన్న రోవ్‌మన్ పావెల్ చేతిలో పడటంతో అతడు క్రీజు నుంచి వెనుదిరిగాడు. ఇక మైదానంలోకి వచ్చిన కెప్టెన్ రిషభ్ పంత్ మరోసారి విఫలమయ్యారు. కేవలం 10 పరుగులు మాత్రమే చేసి కామెరూన్ గ్రీన్ బౌలింగ్ లో పంత్ డగౌట్ కి వెళ్లిపోయాడు. అనంతరం బ్యాటింగ్ కి వచ్చిన నికోలస్ పూరన్ మరోసారి తీవ్ర నిరాశ పరిచాడు. కేవలం 13 పరుగులు చేసి కార్తిక్ త్యాగి బౌలింగ్ లో రమణ్ దీప్ సింగ్ కి క్యాచి ఇచ్చి పూరన్ పెవిలియన్ కి వెళ్లిపోయాడు. ఆ తర్వాత వచ్చిన అబ్దుల్ సమద్ (2) సైతం పెద్దగా రాణించలేదు.. అనుకూల్ రాయ్ వేసిన ఓ కిరాక్ బంతికి క్లిన్ బౌల్డ్ అయ్యాడు.


వరుసగా వికెట్లు పడుతున్నప్పటికీ ఆయూష్ బదోనీ ( 34 బంతుల్లో 7 ఫోర్లు 2 సిక్సులతో 54 పరుగులు) మాత్రం హాఫ్ సెంచరీ చేసి జట్టుని గెలుపు దిశగా నడిపిస్తున్న క్రమంలో అనుకూల్ రాయ్ బౌలింగ్ లో రింకు సింగ్ కి క్యాచ్ ఇచ్చి మైదానం వీడాడు. ఆ తర్వాత బ్యాటింగ్ కి వచ్చిన మహ్మద్ షమీ (1)ని సునీల్ నరైన్ ఔట్ చేశాడు. చివర్లో బ్యాటింగ్ కి వచ్చిన ముకుల్ చౌదరి చెలరేగిపోయాడు. కేవలం 27 బంతుల్లోనే సూపర్బ్ (54 నాటౌట్) అర్థ శతకం బాదేశాడు. ముకుల్ ఇన్నింగ్స్ లో ఏకంగా 7 సిక్సులు 2 ఫోర్లు ఉన్నాయి. ముకుల్ బ్యాటింగ్ దెబ్బకి కేకేఆర్ చిత్తుగా ఓడిపోయింది. కేకేఆర్ బౌలర్లలో వైభవ్ అరోరా, అనుకూల్ రాయ్ చెరో రెండు వికెట్లు తీసుకోగా, సునీల్ నరైన్, కార్తీక్ త్యాగి, కామెరాన్ గ్రీన్ తలో వికెట్ పడగొట్టారు.

# ఎల్లో డ్రెస్‌లో కృతి శెట్టి.. కిర్రాక్ లుక్ వైరల్!

తెలుగు సినీ ప్రేక్షకులకు 'బేబమ్మ'గా బాగా దగ్గరైన కృతి శెట్టి, తనదైన నటనతోనూ, అందంతోనూ తక్కువ కాలంలోనే గుర్తింపు తెచ్చుకుంది. సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్‌గా ఉంటూ తన లేటెస్ట్ ఫోటోలను అభిమానులతో పంచుకునే కృతి, ప్రతీసారి తన డ్రెస్సింగ్ స్టైల్‌తో ఆకట్టుకుంటూనే ఉంటుంది. లేటెస్ట్ గా ఆమె షేర్ చేసిన ఫోటోలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి.



క్లాస్ మాస్ ప్రేక్షకులను సమానంగా ఆకట్టుకునేలా ఆమె ఈ ఫోటోషూట్‌లో మెరిసింది. ఈ లాంగ్ పసుపు గౌన్ ఆమెకు చాలా స్టైలిష్ లుక్‌ను ఇచ్చింది. స్లీవ్‌లెస్ టాప్‌తో కూడిన ఈ డ్రెస్ డిజైన్ ఆమె గ్లామర్‌ను మరింత ఎలివేట్ చేసింది. ముఖ్యంగా డ్రెస్‌కు ఉన్న కట్ ఆమె లుక్‌కు ఒక మోడ్రన్ టచ్ ఇచ్చింది. ఎక్కడా అతిగా అనిపించకుండా, చాలా హుందాగా కనిపిస్తూనే తనలోని గ్లామర్ యాంగిల్‌ను ఈ ఫోటోల ద్వారా హైలెట్ చేసింది. తన హెయిర్ స్టైల్ మినిమమ్ మేకప్‌తో ఆమె సహజ సిద్ధమైన అందాన్ని ప్రదర్శించింది. ఈ ఫోటోలలో కృతి ఇచ్చిన పోజులు చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాయి. కిటికీ పక్కన నిలబడి ఆకాశం వైపు చూస్తున్నట్లుగా ఇచ్చిన స్టిల్స్, ఆమెలోని విభిన్నమైన ఎక్స్‌ప్రెషన్స్‌ను తెలియజేస్తున్నాయి. చెవికి పెట్టుకున్న చిన్నపాటి జుమ్కీలు తప్ప మరే ఇతర భారీ ఆభరణాలు వాడకుండా తన డ్రెస్‌నే హైలైట్ చేసింది. వైట్ కలర్ హీల్స్ ఆమె మొత్తం కాస్ట్యూమ్‌కు పర్ఫెక్ట్ కాంబినేషన్‌గా నిలిచాయి.



ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె ఈ ఫోటోలను షేర్ చేసిన కొద్దిసేపటికే వేలల్లో లైకులు, కామెంట్లు వచ్చాయి.

ఇక ఉప్పెన సినిమాతో ఆమె అందుకున్న క్రేజ్ అంతా ఇంతా కాదు. తొలి చిత్రంతోనే వంద కోట్ల వసూళ్లను సాధించిన హీరోయిన్‌గా రికార్డు సృష్టించింది. ఆ తర్వాత 'శ్యామ్ సింగరాయ్', 'బంగార్రాజు' వంటి చిత్రాలతో వరుస విజయాలను అందుకుంది. అయితే, గత కొంతకాలంగా ఆమెకు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయి విజయాలు దక్కలేదు. అయినప్పటికీ, ఆమె క్రేజ్ మాత్రం తగ్గలేదు. కేవలం తెలుగులోనే కాకుండా తమిళం, మలయాళ చిత్రాల్లోనూ అవకాశాలు దక్కించుకుంటూ తన పరిధిని విస్తరించుకుంటోంది. నెక్స్ట్ తమిళంలో ఆమె నటించిన ా×ఖ సినిమా రిలీజ్ కానుంది.



ప్రస్తుతం కృతి శెట్టి తన దృష్టిని వైవిధ్యమైన పాత్రలపై పెట్టింది. గ్లామర్ రోల్స్ మాత్రమే కాకుండా, నటనకు ప్రాధాన్యత ఉన్న సినిమాలను ఎంచుకుంటోంది. కన్నడలో కూడా కొన్ని క్రేజీ ప్రాజెక్టులలో ఆమె భాగమైనట్లు సమాచారం. ఒక హీరోయిన్‌గా నిలదొక్కుకోవడానికి కావలసిన అన్ని అర్హతలు ఉన్న కృతి, ఒక బలమైన సక్సెస్ కోసం ఎదురుచూస్తోంది. సోషల్ మీడియా ద్వారా తన ఫాలోయింగ్‌ను నిలబెట్టుకుంటూనే, తనలోని సరికొత్త లుక్స్‌ను ఎప్పటికప్పుడు పరిచయం చేస్తోంది.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At FLAT NO. 31, RAJEEV NAGAR, VISAKHA A COLONY, NEAR JAMATHOTA, KILLIPALEM PANCHAYAT, PATHAPATNAM, SRIKAKULAM DIST. "PEN POWER" vide PRGI Registration No. "APTEL/25/A4918" Editor: GANTYADA APPARAO. e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965PANCHAYAT, PATHAPATNAM, SRIKAKULAM DIST. Editor GANTYADA APPARAO.e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965